ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 22 నవంబరు 2025







• అల నక్షత్రాలను పోలి

కార్తీకమాసం ముగియడంతో జిల్లావ్యాప్తంగా పోలి పాడ్యమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. నెలరోజుల పాటు నోములు ఆచరించిన భక్తులు కృష్ణానదిలో పోలిని స్వర్గానికి పంపి కార్తీక పూజలకు ముగింపు పలికారు. మచిలీపట్నంలోని నాగులేరు వద్ద భక్తులు వదిలిన దీపాలతో ఆ ప్రాంతమంతా శోభాయమానంగా వెలిగింది.

మంత్రిపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులతో టీచర్



ఒకే విద్యార్థి, ఒకే టీచర్!

- అవిరిపూడి ప్రాథమిక పాఠశాల (ఏపీ) దుస్థితి 8
- మంత్రిపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో ఇద్దరే..
- మొవ్వ మండలంలోని స్కూళ్లలో విద్యార్థుల కొరత

దాళ్వా సాగు సరే..
కాల్వలైనా బాగు చేస్తారా?
అధికారులను ప్రశ్నిస్తున్న జిల్లా రైతులు

- కాల్వల మరమ్మతులకు నిధుల కేటాయింపుల్లో కోత
- ఏటా ఆలస్యంగా అనుమతులు.. ఆ తర్వాత ఆమోదం
- వర్షాకాలం నాటికి తూతూమంత్రంగా పనులు
- ఈసారైనా త్వరగా ప్రారంభించాలని వేడుకోలు
- అవుట్‌ఫాల్ స్లూయిస్ మరమ్మతుల మాటేంటి?

'రబీ సీజన్‌లో పంటకాల్వలకు నీటిని విడుదల చేసేది లేదు. రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి' నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్న మాట ఇది. నీటి విడుదల లేదు సరే.. వచ్చే వేసవిలో పంట కాల్వలు, డ్రెయినేజీలకు కనీస మరమ్మతులు చేస్తారా లేక అంచనాలు రూపొందించి, ఆమోదం లభించలేదని చివరి వరకు మిన్నకుండి పోతారా..? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటినుంచే కాల్వల పనులు చేసేందుకు ప్రతిపాదనలు తయారుచేసి, ప్రభుత్వానికి పంపితే, జనవరిలో ఆమోదం లభించే అవకాశం ఉంటుందని, వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తిచేయొచ్చని పేర్కొంటున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలోని పంటకాల్వల కనీస మరమ్మతులకు అంచనాలు తయారుచేయడం, వాటికి ఆమోదం లభించడంలో ఏటా జాప్యం జరుగుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు అంచనాలు తయారు చేసి పంపినా, ఏప్రిల్ వరకు ఆ పనులకు ఆమోదం లభించని పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్‌లో ఆమోదం లభించి, టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడానికి మరో నెలపైనే సమయం పడుతోంది. ఈలోగా జూన్‌లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. జూన్‌లో అడపాదడపా వర్షాలు కురిస్తే కాల్వల్లో పూడికతీత పనులు చేసేందుకు, గుర్రపుడెక్క, నాచు, తూటుకాడను పూర్తిస్థాయిలో తొలగించేందుకు అవకాశం ఉండదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నామమాత్రపు పనులతో చేతులు దులుపుకోవడం కూడా ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఖరీఫ్‌లో ఆరేడు నెలలపాటు పంటకాల్వల ద్వారా సాగునీరు సక్రమంగా అందక, డ్రెయినేజీలు పొంగిపొర్లి మురుగు సకాలంలో దిగువకు పోని పరిస్థితి ఏర్పడుతోంది.



బందరులోని కాల్వ (ఇన్‌సెట్‌లో) కోడూరు మండలంలోని అవుట్‌ఫాల్ స్లూయిస్ దుస్థితి

నిధుల కేటాయింపులో కోతలే..

ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రధాన కాల్వల్లో, డ్రెయినేజీల్లో నీటిప్రవాహానికి అడ్డులేకుండా తూడు, నాచు, గుర్రపుడెక్కను తొలగించేందుకు ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఓఅండ్‌ఎం) పనులు చేసేందుకు నిధులు కేటాయిస్తారు. ఈ పనులకు 2023లో రూ.57 కోట్లు కేటాయించగా, 2024లో రూ.27 కోట్లు, 2025లో ఒక్కో నియోజకవర్గానికి రూ.2 కోట్ల చొప్పున రూ.14 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో కాల్వల్లో గుర్రపుడెక్క, తూడు, నాచును తొలగించే పనులు చేసేందుకు ఈ ఏడాది ఆగస్టులో అనుమతులిచ్చారు. జూలై, ఆగస్టులో కురిసిన భారీవర్షాలకు డ్రెయినేజీలు పొంగి ప్రవహించాయి. నాట్లువేసిన పొలాల్లోని పైరు మునిగాక, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క తదితరాలను తొలగించే పనులు చేశారు. ఏటా నాట్లువేసే జూలై, ఆగస్టులో లేదా పంట చేతికొచ్చే నవంబరు, డిసెంబరులో కురిసే భారీవర్షాల కారణంగా రైతులు నష్టపోవడం ఆనవాయితీగా వస్తోంది.

కాల్వగట్లను బలోపేతం చేయాలి

ఈ ఏడాది వేసవిలో డెల్టా ఆధునికీకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను చేపట్టేందుకు అవకాశం లేదని జలవనరుల శాఖ అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు. ఓఅండ్‌ఎం పనులు చేసేందుకు అంచనాలు తయారు చేసే పనిలో ఉన్నామని, ఈ ప్రతిపాదనలను ప్రభుత్వ ఆమోదం కోసం పంపుతామని అంటున్నారు. త్వరితగతిన అనుమతులు ఇస్తే ఈ వేసవిలో పంటకాల్వలు, డ్రెయినేజీల్లో తూడు, గుర్రపుడెక్కలను నిర్మూలించేందుకు రసాయనాల పిచికారీతో పాటు వేసవిలో ప్రధాన కాల్వలు, బ్రాంచ్ మిగతా 6లో..

కాసానగర్ వద్ద ఆరబెట్టిన ధాన్యాన్ని పోగు చేసుకుంటున్న రైతులు



వర్షాందోళన
వాతావరణ శాఖ వర్ష హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

- కోతలు పూర్తయ్యి కళ్లాల్లో ఉన్న ధాన్యం
- మిల్లులకు తరలించేందుకు హడావిడి
- మొంథా నష్టం మానకముందే మరో గండం
- దివిసీమలో పరిస్థితి మరింత దైన్యం

అవనిగడ్డ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో దివి రైతులు ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజుల క్రితం మొంథా తుఫాన్ కారణంగా పాలుపోసుకునే దశలో, గింజ గట్టిపడే దశలో ఉన్న వరిపంటకు తీవ్రనష్టం వాటిల్లగా, దాని నుంచి కోలుకుని కోతలు మొదలుపెట్టిన రైతన్నలు ప్రస్తుతం భయపడిపోతున్నారు. ఇప్పటికే చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల్లో వరి కోతలు మొదలు కాగా, మిషన్ కోతలు కోసిన వారు ధాన్యాన్ని ఆరబెట్టుకుని మిల్లులకు తరలించేందుకు హడావిడి పడుతున్నారు. ఇప్పటి వరకు 3,800 మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయగా, అంతకు మూడింతలు కోతలు పూర్తయ్యి, కళ్లాల్లో ఉన్నాయి. మొంథా తుఫాన్ కారణంగా ఇప్పటికే పలుచోట్ల తాలు కంకులు దర్శనమిస్తుండగా, మరికొన్నిచోట్ల మానుగాయి తెగులు వ్యాపించి ధాన్యం నాణ్యత పూర్తిగా దెబ్బతింది. ఈ తరుణంలో మళ్లీ వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించటంతో రైతులు మిషన్ కోత ద్వారా కోసి ఆరబెట్టిన ధాన్యాన్ని పూర్తిగా ఆరుదల కాకముందే మిల్లులకు తోలేందుకు పోటీ పడుతున్నారు. తేమశాతం ఎక్కువగా ఉండటంతో మిల్లర్లు ధర తక్కువకు అడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.


రైతులు నష్టపోకుండా చర్యలు : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ భరోసా ఇచ్చారు. ధాన్యం విక్రయాల కోసం ప్రభుత్వ వాట్సాప్ నెంబర్ 7337359375 ద్వారా అందే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో రైతుల కోసం 540 టార్పాలిన్లు అందుబాటులో ఉంచామని, ఇప్పటికే కోతలు కోసిన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి టార్పాలిన్లను వినియోగించుకోవాలన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 3,798 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.8.15 కోట్లు చెల్లించామని, ఎలాంటి పరిస్థితుల్లోనూ రైతులు మిగతా 6లో..

సాఫీగా సాగిపోవాల్సిన లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)కు 'నాలా' ప్రతిబంధకాలు ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రభుత్వం నాలాను రద్దుచేసి ఈడీసీని ప్రవేశపెట్టినప్పటికీ రెండింటి మధ్య లోటుపాట్ల కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో వందల సంఖ్యలో దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉండిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

విన్నపాలు వినాలా
ఎల్‌ఆర్‌ఎస్‌లో నాలా గందరగోళం

- జూలై 25న నాలా రద్దు.. కొత్తగా ఈడీసీ విధానం
- రద్దుకు ముందు దరఖాస్తు చేస్తే నాలా ఫీజే కట్టాలి
- రెవెన్యూ శాఖ ప్రమేయం కూడా తొలగింపు
- ఎంత ఫీజు కట్టాలో తెలియక దరఖాస్తుదారుల సందిగ్ధం
- రిజిస్ట్రేషన్ విలువపై 5 శాతం అంటున్నా సందిగ్ధమే..
- వందల సంఖ్యలో పెండింగ్ దరఖాస్తులు
- సమస్యను పరిష్కరించాలని దరఖాస్తుదారుల వినతి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వ్యవసాయ భూమిని వ్యవసాయేతరంగా మార్చుకోవటానికి గతంలో నాలా చట్టం ఉండేది. ప్రభుత్వం దీనిని రద్దుచేసి రెవెన్యూతో సంబంధం లేకుండా ఆ స్థానంలో ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ చార్జెస్ (ఈడీసీ)ను ప్రవేశపెట్టింది. దీనివల్ల ప్లాన్‌కు అనుమతి కోరే సమయంలోనే ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)కు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో విజయవాడ, సీఆర్‌డీఏ పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో వందలాది సంఖ్యలో దరఖాస్తులు మిగతా 6లో..

నిడమానూరు డబుల్ డెక్కర్‌పై
నీలినీడలు

నిడమానూరు జంక్షన్-మహానాడు జంక్షన్ వరకు ఎన్‌హెచ్-16పై ప్రతిపాదించిన డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. విజయవాడ వెస్ట్ బైపాస్ అందుబాటులోకి రానున్న నేపథ్యంలో దీనిపై కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ పునరాలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో ప్రతిపాదించిన 7 కిలోమీటర్ల నాలుగు వరసల ఫ్లై ఓవర్ ప్రతిపాదన ఉపసంహరణ దిశగా ఆ ఆలోచనలు ఉన్నాయి.

సింగిల్ ఫ్లై ఓవర్‌ను రద్దుచేసే యోచనలో కేంద్రం

- వెస్ట్ బైపాస్ పూర్తికావటంతో పునరాలోచనలో మోర్త్
- విశాఖ నుంచి వచ్చే ట్రాఫిక్ వెస్ట్ బైపాస్‌కు వెళ్తుందనే ఆలోచన
- మెట్రో మార్గానికి ఇబ్బంది లేకుండా ప్రతిపాదనలు
- బెజవాడకు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ అవసరమే..
- కీలకమైన ప్రాజెక్టు చేజారకుండా ప్రజాప్రతినిధులు పట్టుబట్టాలి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా గన్నవరం నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా ఏలూరు రోడ్డు, రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్ వరకు కారిడార్-1 వెళ్తుంది. ఈ మార్గంలోని నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు ఎన్‌హెచ్-16పై మధ్య వరసలో 4 వరసల ఫ్లై ఓవర్‌కు గతంలోనే కేంద్రం అంగీకరించింది. అయితే, ఈ ఫ్లై ఓవర్ కారణంగా నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు మెట్రో లైన్‌కు ఇబ్బంది ఏర్పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) అధికారులు నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు 4.5 కిలోమీటర్ల మేర సింగిల్ ఫ్లై ఓవర్‌ను డబుల్ డెక్కర్‌గా మార్చాలని ప్రతిపాదించారు. కింది వరసలో సాధారణ ఫ్లై ఓవర్‌పై బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రయాణిస్తాయని, పై ఫ్లై ఓవర్‌పై మాత్రం మెట్రో రైళ్ల రాకపోకలు సాగిస్తాయని, ఈ డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు రూ.1,000 కోట్లు అంచనా వ్యయం అవుతుందని మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు అండ్ ట్రాన్స్‌పోర్ట్ (మోర్త్)కు ఏపీఎంఆర్‌సీ అధికారులు ప్రతిపాదించారు. దీనిపై మోర్త్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్ అంతా అటు వెళ్లే అవకాశం ఉంది కాబట్టి.. సాధారణ ఫ్లై ఓవర్ అవసరం లేదన్న దిశగా మోర్త్ ఆలోచన చేస్తోంది. సాధారణ ఫ్లై ఓవర్ కాదనుకుంటే.. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కూ మిగతా 6లో..



ప్రజాప్రతినిధులు స్పందించాలి

మెట్రో కారిడార్ కారణంగా నిడమానూరు ఫ్లై ఓవర్ విషయంలో కాలయాపన జరిగింది. ఇదే సందర్భంలో విజయవాడ వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-3 పనులు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నిడమానూరు ఫ్లై ఓవర్ ప్రతిపాదన నుంచి తప్పుకొనే ఆలోచనలు చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఎన్‌హెచ్ అధికారులకు సంకేతాలు అందించినట్టు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు గట్టిగా నిలబడకపోతే మాత్రం డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను కోల్పోయే ప్రమాదం ఉంది.

విజయవాడకే అతిపెద్దది

ఇప్పటి వరకు విజయవాడలో ఉన్న ఫ్లై ఓవర్ల కంటే నిడమానూరు ఫ్లై ఓవర్ అతి పెద్దది. కనకదుర్గ ఫ్లై ఓవర్ కంటే కూడా రెట్టింపు సంఖ్యలో 7 కిలోమీటర్ల మేర ఉంటుంది. బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్లకు అనుసంధానంగా మహానాడు జంక్షన్ నుంచి సెంట్రల్ మీడియంలో నిడమానూరు జంక్షన్ వరకు 4 వరసల విధానంలో నిర్మించేలా దీని డీపీఆర్ తయారు చేశారు.

ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు తమ గోడు వినిపిస్తున్న డ్వాక్రా మహిళలు



స్త్రీనిధి స్వాహా
పెనమలూరులో ఓ బుక్‌కీపర్ చేతివాటం
రూ.25 లక్షల వరకు మాయం

- విధుల నుంచి తొలగించిన అధికారులు
- ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు

పెనమలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మండలంలోని ఓ డ్వాక్రా సంఘంలో రూ.25 లక్షల అవినీతికి పాల్పడిన బుక్‌కీపర్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆమె చేతిలో మోసపోయిన కొందరు డ్వాక్రా గ్రూపు మహిళలు శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కలిసి తమ గోడు చెప్పుకొన్నారు. వివరాల్లోకి వెళితే.. పెనమలూరులోని ఐదో సెక్టార్ ఏరియాలో 43 డ్వాక్రా గ్రూపులకు బుక్ కీపర్‌గా గతంలో మోత్రపు సునీత పనిచేసేది. తాను కొన్నేళ్లుగా తన పరిధిలోని సంఘ సభ్యులకు స్త్రీనిధి రుణాలు ఇప్పించేది. ఈ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసి, డబ్బును సదరు డ్వాక్రా గ్రూపు ఖాతా వేసిన వెంటనే.. చేతివాటం చూపించి రూ.లక్షలు కాజేసేది. గ్రూపు సభ్యులు ప్రశ్నిస్తే బుకాయించి నోళ్లు మూయించేది. అయితే, గ్రూపు మిగతా 6లో..

పుష్ప హోటల్‌లో.. పేలిన తూటా!

- 1991లో తెగబడిన షెల్టర్ జోన్ పీడబ్ల్యూజీ నక్సల్స్
- మొగల్రాజపురంలో ఎస్‌ఐ దారుణ హత్య.. నేటికి 34 ఏళ్లు

6



ఇంద్రకీలాద్రిపై ముగిసిన కార్తీక ఉత్సవాలు

- పూర్ణాహుతితో ముగింపు
- 25 వరకు అర్ధమండల దీక్షల స్వీకరణ



భక్తులకు గాజుల ప్రసాదం పంపిణీ చేస్తున్న ఈవో సతీమణి

ఇంద్రకీలాద్రిపై ముగిసిన కార్తీక ఉత్సవాలు



ఇంద్రకీలాద్రి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నెలరోజులపాటు జరిగిన పవిత్ర కార్తీకమాస ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం వేదోక్తంగా పూర్ణాహుతిని నిర్వహించారు. శివాలయం వద్ద ఉన్న పాత యాగశాలలో వేద మంత్రాల మధ్య సాగిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యుడు వి.శివ ప్రసాద్‌శర్మ, వేద పండితులు, దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు బడేటి ధర్మారావు, పెనుమత్స రాఘవరాజు, ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర్‌బాబు పాల్గొన్నారు.

మహిళా భక్తులకు గాజుల ప్రసాదం

ఇంద్రకీలాద్రిపై శుక్రవారం మహిళా భక్తులకు గాజుల ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ సతీమణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శుభప్రదమైన శుక్రవారం అపూర్వమైన ప్రసాదం లభించడం పట్ల వారు ఎంతో సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

25 వరకు అర్ధమండల దీక్షల స్వీకరణ

దేవస్థానం ఈవో శీనానాయక్ శుక్రవారం శివాలయం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీకాకుళం నుంచి వచ్చిన భవానీ భక్తులను కలిశారు. వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన భవానీలు తాము మహామండపం 6వ అంతస్తులో అర్ధమండల దీక్ష తీసుకున్నామని తెలిపారు. అర్ధమండల దీక్షలను ఈనెల 25వ తేదీ వరకు స్వీకరించే అవకాశం ఉంది.

నలుగురు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది తొలగింపు

ఇంద్రకీలాద్రి : దేవస్థానంలో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు సెక్యూరిటీ సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్లు శుక్రవారం ఈవో శీనానాయక్ తెలిపారు. ఏజెల్ సెక్యూరిటీ సంస్థ సెక్యూరిటీ ఆఫీసర్ ఎ.సాయికుమార్, సెక్యూరిటీ సూపర్వైజర్స్ రాజేష్ నాయక్, శ్రీధర్, రమేష్ నాయక్‌లను దేవస్థానం విధులు నుంచి తొలగించాలని సెక్యూరిటీ ఏజెన్సీ, దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లను ఈవో ఆదేశించారు. ఏజెల్ సెక్యూరిటీ ప్రతినిధులు ఈవోని కలసి, నలుగురు సెక్యూరిటీ సిబ్బంది దేవస్థానం భద్రతాచర్యల్లో నిర్లక్ష్యం వహిస్తూ, వ్యక్తిగత విబేధాలతో సంస్థకు చెడ్డ పేరు తీసుకువస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం చేశారు. వీరి స్థానంలో తక్షణమే వేరొక సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఈవో ఆదేశించారు. దేవస్థానంలో ప్రవేట్ సెక్యూరిటీ వ్యవస్థ పర్యవేక్షణకు దేవస్థానం తరఫున టెంపుల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఏర్పాటు ఆవశ్యకతను ధర్మకర్తల మండలి చైర్మన్, దేవదాయశాఖ కమిషనర్ల దృష్టికి తీసుకువెళ్తామని ఈవో పేర్కొన్నారు.



నర్సింగ్ విద్యార్థితో జీజీహెచ్ వైద్యులు

జీజీహెచ్‌లో అరుదైన వాయిస్ శస్త్రచికిత్స

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో అరుదైన వాయిస్ శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తిచేశారు. మహిళా స్వరంతో మాట్లాడే 19 ఏళ్ల యువకుడికి ఆపరేషన్ చేసి పురుషుడి స్వరం రప్పించారు. ఈఎన్టీ విభాగాధిపతి డాక్టర్ కె.రవి ఆపరేషన్‌ను నిర్వహించారు. వివరాలను ఆసుపత్రి వైద్యబృందం శుక్రవారం మీడియాకు వెల్లడించింది. ఏలూరుకు చెందిన నర్సింగ్ విద్యార్థి తేజవికాస్ మహిళా స్వరంతో మాట్లాడేవాడని వైద్యులు తెలిపారు. దీంతో అతను మానసికంగా ఇబ్బంది పడేవాడని చెప్పారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం ప్యూబర్ఫోనియా వ్యాధి ఉన్నట్టు నిర్ధారించామన్నారు. వాయిస్ థెరపీ చేస్తే చాలా తక్కువ మార్పు వస్తుందని వైద్యులు చెప్పారు. టైప్-3 థైరోప్లాస్టీ శస్త్ర చికిత్స ఉత్తమ మార్గంగా శస్త్ర చికిత్స పూర్తి చేసినట్లు చెప్పారు. చికిత్స అనంతరం యువకుడికి సహజమైన పురుష స్వరంగా మారిపోయిందని తెలిపారు. చికిత్సను విజయవంతం చేసిన డాక్టర్ కె.రవి, అనస్తీషియా డాక్టర్ వినయ్‌లను సిద్ధార్థ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఏడుకొండలు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వి.రావు అభినందించారు. అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేసిన వైద్యులకు నర్సింగ్ విద్యార్థి తేజవికాస్ కృతజ్ఞతలు తెలిపాడు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

పైలెట్ ప్రాజెక్టును విజయవంతం చేయండి

» ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పండించిన రొయ్యకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చేందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి పైలెట్ ప్రాజెక్టును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మత్స్యశాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో ఆక్వా ఎక్స్ఛేంజ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టిసారించి పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. ఆక్వా పంట ఎగుమతిని ప్రపంచంలో ఎక్కడికి పంపించాలన్నా, సాగు విధానం, ప్రపంచానికి తెలియజేసే విధంగా హైజినిక్, టెక్నాలజీ, ఆక్వా డిజిటల్ ట్రేసబిలిటీ భాగంగా ప్రథమ విడత ఫేజ్‌లో నందివాడ మండలాన్ని ఎంపికచేశారన్నారు. మండలంలోని అరిపిరాల, వెంకటరాఘవాపురం, వెన్ననపూడి, తుమ్మలపల్లి, నందివాడ, పుట్టగుంట గ్రామాలల్లో పైలెట్ ప్రాజెక్టును నిర్వహిస్తున్నామన్నారు. మొదటి ఫేజ్‌లో భాగంగా మూడు నెలల్లో యిచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టులో భాగంగా, వారికి తన పూర్తి సహకారముంటుందన్నారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, ఆక్వా కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తికొండ శ్రీరాజబాబు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

1991లో తొలిసారిగా బెజవాడలోని పుష్పహోటల్‌లో పీపుల్స్ వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ) నక్సల్స్ ఓ ఎస్సైని దారుణంగా హత్యచేశారు. అది జరిగి నేటికి 34 ఏళ్లు అయ్యింది. బెజవాడలో నక్సల్స్ పంజా విసిరిన మొదటి ఉదంతం ఇది. పుష్పహోటల్‌లో తెల్లవారుఝామున 5.30 గంటల సమయంలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ (ఎస్‌ఐబీ)లో పనిచేసే ఎస్సై ఇమ్మానియేల్ రాజు దారుణ హత్యకు గురయ్యాడు. పెను సంచలనం సృష్టించిన మర్డర్ మిస్టరీపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

పుష్ప హోటల్‌లో.. పేలిన తూటా!

» 1991లో తెగబడిన షెల్టర్ జోన్ పీడబ్ల్యూజీ నక్సల్స్

» బెజవాడలోని పుష్ప హోటల్‌లో ఎస్‌ఐ దారుణ హత్య

» నక్సల్స్ సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందిస్తున్నాడనే నెపంతో.. పిస్టల్‌తో కాల్చి హత్య



ఫ్లాష్ బ్యాక్

బెజవాడలో నిత్యం రద్దీగా ఉండే పుష్పహోటల్ సెంటర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎస్సై ఇమ్మానియేల్ రాజు నక్సల్స్ కదలికలపై పక్కా సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు, నక్సల్స్‌ల మధ్య పోరు నెలకొన్న సమయంలో ఎస్సై అందించే కీలక సమచారంతో నక్సల్స్‌కు ఇబ్బందికరంగా మారింది. పీపుల్స్ వార్ గ్రూప్‌లో సర్కారు జిల్లాల బాధ్యతలు చూడటంతో పాటు రాష్ట్ర కమిటీ మెంబర్, పొలిట్ బ్యూరో మెంబర్‌గా వ్యవహరించే నిమ్మలూరి భాస్కరరావు అలియాస్ మల్లిక్ పూర్తి సమాచారం తెలుసుకునే బాధ్యతను ఎస్సై ఇమ్మానియేల్ రాజుకు అప్పగించడం.. ఈ విషయం పీడబ్ల్యూజీ అగ్రనాయకత్వానికి సమాచారం అందింది. దీంతో సర్కారు జిల్లాలకు చెందిన ఓ దళానికి ఎస్సై ఇమ్మానియేల్ రాజును చంపమని బాధ్యతలు అప్పగించింది. విజయవాడలోని పీడబ్ల్యూజీ కొరియర్స్, సానుభూతిపరుల ద్వారా పుష్ప హోటల్ సెంటర్ దగ్గర నివశిస్తున్నాడని తెలుసుకున్నారు. ఇమ్మానియేల్ రాజు ఇల్లెక్కడో తెలుసుకోవటానికి ఇద్దరు పిల్లల్ని ఎంచుకుని, వారికి చిరుతిళ్లు కొనిపెట్టి ప్రతి ఇంటికీ వెళ్లి ఇమ్మానియేల్ రాజు ఇల్లు ఇదేనా అని అడిగించారు. ఇలా ఆ వీధిలో ఓ ఇంటి దగ్గర ఇమ్మానియేల్ రాజునే ఆ పిల్లలు అడిగారు. దీంతో ఇమ్మానియేల్ రాజు స్థానికంగా ఉండే పీడబ్ల్యూజీ సానుభూతిపరుడే ఈ పని చేయించాడని తెలుసుకుని ఆ పిల్లలకు తాను చెప్పాలనుకున్న ఘాటైన సందేశాన్ని చెప్పి పంపారు. పిచ్చి పని చేసిన విషయం తెలుసుకున్న నక్సల్స్ దళం ఆ సానుభూతిపరుడిని ఉన్న పళానా ఇంటిని ఖాళీ చేయించారు. కొద్ది రోజులు గ్యాప్ తీసుకున్నారు. ఇమ్మానియేల్ రాజు ఈ పరిణామానికి వెరవలేదు. తన ఇంటిలోనే ఉంటూ ఎస్‌ఐబీకి వెళుతూ ఉండేవారు. కొంత కాలం కొండపల్లి రిజర్వు ఫారెస్టులోనే అజ్ఞాతంలో ఉన్న దళం మళ్లీ బయటకు వచ్చి పుష్ప హోటల్ సెంటర్‌లో రెక్కీ వేసింది. ప్రతి రోజూ ఇమ్మానియల్ తెల్లవారుఝామునే బయటకు నడచుకుంటూ వచ్చి పుష్ప హోటల్‌కు వచ్చి కూర్చుని తీరిగ్గా పేపర్ చదువుకునేవారు. ఈ విషయాన్ని పసిగట్టిన దళ సభ్యులు కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌కు వెళ్లి ఇమ్మానియేల్ రాజు మర్డర్ ప్లాన్‌ను రూపొందించుకున్నారు. మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు సాయుధాలతో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ నుంచి బయలుదేరాలని, ఐదు గంటలకల్లా విజయవాడకు చేరుకోవాలని నిర్ణయించారు. ఇమ్మానియేల్ రాజు ఎప్పటిలాగానే ఐదు గంటలకు బయటకు నడుచుకుంటూ వచ్చి సమీపంలో పేపర్ కొనుగోలు చేసి పుష్ప హోటల్‌కు వచ్చారు. పుష్ప హోటల్ ఇంకా అప్పటికి తెరచుకోకపోతే డోర్ కొట్టి అందులో పని చేస్తున్న సిబ్బందితో షట్టర్ తీయించారు. ఆ తర్వాత ఆయన చివరి వరుసలో ఉన్న టేబుల్ దగ్గర కూర్చుని పేపర్ చదువుకుంటున్నారు. ఇదే సమయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఇద్దరు నక్సల్స్ బయట కాపలా కాసే విధంగా, ఇద్దరు హోటల్‌లోకి వెళ్లేలా ప్లాన్ చేశారు. బ్యాగుతో వెళ్లిన ఇద్దరిలో ఒకరు ఇమ్మానియేల్ రాజు ఎదురుగా ఉన్న టేబుల్ మీద ఆయనకు ఎదురుగా కూర్చున్నారు. రెండో వ్యక్తి ఆ పక్క టేబుల్‌లో కూర్చున్నాడు. టీ కోసం వచ్చారేమోనని పెద్దగా వారిని ఇమ్మానియేల్ రాజు అనుమానించలేదు. పేపర్ చదువుతుండగా, పక్క టేబుల్ మీద ఉన్న బ్యాగులో కాగితంలో చుట్టిన పిస్టల్‌ను తీసి తన ఎదురుగా ఉన్న ఇమ్మానియేల్ రాజుకు గురి పెట్టి పాయింట్ బ్లాక్ రేంజ్‌లోనే కాల్చాడు. అక్కడికక్కడే కుర్చీపై ఇమ్మానియేల్ రాజు కూలిపోయాడు. పిస్టల్ సౌండ్ రావటంతో స్థానికులు ఒక్కసారిగా హోటల్‌కు దగ్గరకు వచ్చారు. లోపలి నుంచి ఇద్దరు వచ్చే లోపు బయట ఉన్న వారు ప్రజలకు పిస్టల్స్ చూపించి దూరంగా జరిగేలా చేశారు. లోపలి వాళ్లు బయటకు రాగానే, అక్కడ ముందుగానే అందుబాటులో ఉంచిన సైకిళ్లపై పరారయ్యారు. ఈ ఘటనకు ముందు కానీ, వెనుక కానీ బెజవాడలో నక్సల్స్ నుంచి దుశ్చర్యలు జరగలేదు. 2006లో రాకెట్ లాంచర్లను దిగుమతి చేసుకోవటం తప్పితే అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

వినాలా విన్నపాలు

(5వ పేజీ తరువాయి)

వచ్చాయి. విజయవాడ నగరంలో 1,500 వరకు, సీఆర్‌డీఏ పరిధిలో 4 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. అయితే, ఈ దరఖాస్తులు ఓ పట్టాన పరిష్కారం కావట్లేదు. విజయవాడ నగరంలోనే 900, సీఆర్‌డీఏ పరిధిలో 2 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఇంత భారీ సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటానికి 'నాలా'నే కారణమని తెలుస్తోంది.

సమస్య ఇలా..

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునే క్రమంలో పోర్టల్‌లో నాలా, ఈడీసీ రెండు ఆప్షన్లు చూపిస్తోంది. జూలై 25న నాలా రద్దు చేశారు. ఈలోపు వాటికి మాత్రం నాలా కట్టాలని, ఆ తర్వాత వచ్చిన వాటికి మాత్రం ఈడీసీ కట్టాలని చెబుతున్నారు. ఈడీసీ అయితే వెంటనే అదే పోర్టల్‌లో డబ్బు చెల్లించవచ్చు. నాలా అయితే అదే పోర్టల్‌లో కట్టడానికి వీల్లేదు.

నాలా వ్యవస్థను రద్దు చేశాక రెవెన్యూ శాఖ ఫీజును కట్టించుకోవటం లేదు. మరి ఈ నాలాను ఎలా కట్టాలని దరఖాస్తుదారులు అడిగితే సెల్ఫ్‌గా కట్టుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లోకి వెళ్లి నాలాను చెల్లించాలంటున్నారు. అక్కడ ఇచ్చే రశీదును తీసుకుని రమ్మంటున్నారు. ఇక్కడ సమస్య ఏమిటంటే.. నాలా ఎంత కట్టాలన్నది టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పష్టంగా చెప్పారు. ఏ రోజున నాలా అగ్రిమెంట్ జరిగిందో అప్పటి రిజిస్ట్రేషన్ విలువపై 5 శాతం చెల్లించాలని పేర్కొన్నారు. కానీ, రిజిస్ట్రేషన్ విలువపై 5 శాతాన్ని సరిగ్గా అంచనా వేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో రెవెన్యూ అధికారులు ఇంత కట్టాలని చెబితే కట్టేవారు. ఇప్పుడు సెల్ఫ్‌గా అంచనా వేయలేక దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. పొరపాటున తక్కువ కడితే సమస్యలు వస్తున్నాయంటున్నారు. ఫలితంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ముందుకు కదలట్లేదు.

రద్దు చేసిన ఆప్షన్ ఎందుకు?

నాలా రద్దు చేశాక కూడా పోర్టల్‌లో నాలా ఆప్షన్ ఎందుకు ఇచ్చారని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. ఈడీసీ ఆప్షన్ ఇచ్చిన నేపథ్యంలో, దానికే డబ్బు కట్టించుకుంటే సమస్య తేలిగ్గా పరిష్కారమవుతుందంటున్నారు. దీంతో వందలాది దరఖాస్తుదారులు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, సీఆర్‌డీఏ అధికారుల చుట్టూ పరుగులు పెడుతున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం ఈ సమస్య తమ చేతుల్లో లేదని చెబుతున్నారు. నాలా రద్దుకు ముందు రిజిస్ట్రేషన్ విలువపై 5 శాతం చెల్లించాల్సి వచ్చేది. రద్దు తర్వాత ప్రవేశపెట్టిన ఈడీసీ విధానంలో అయితే రిజిస్ట్రేషన్ విలువపై 4 శాతం చెల్లిస్తే సరిపోతుంది. నాలా రద్దు కాకముందు ఉన్న వాటిని ఈడీసీ పరిధిలోకి తేవటం వల్ల ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో ఇలా రెండుగా ఇచ్చారు. దీనికి స్థానికంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిష్కారాన్ని చూపలేకపోతున్నారు. దీంతో వీటిని తాత్కాలికంగా పెండింగ్‌లో పెడుతున్నారు.

డీటీసీపీకి తెలియజేశాం : మోహన్‌బాబు, అసిస్టెంట్ సిటీప్లానర్-3

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్‌పై వీఎంసీ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్-3 మోహన్‌బాబును వివరణ కోరగా, ఈ సమస్యను తాము డైరెక్టర్ ఆఫ్ కంట్రీ అండ్ టౌన్‌ప్లానింగ్ (డీటీసీపీ) దృష్టికి తీసుకెళ్లామన్నారు. డీటీసీపీ స్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. కాగా, ఈ ప్రతిపాదనలు వెళ్లి నెల దాటినా ఇంకా దీనిపై నిర్ణయం తీసుకోలేదు.

దాళ్వా సాగు సరే.. కాల్వలైనా బాగు చేస్తారా?

(5వ పేజీ తరువాయి)

కాల్వలకు ఉన్న డ్రాప్‌లు, రెగ్యులేటర్లకు కనీస మరమ్మతులు చేయిస్తామని, అవసరమైన ప్రాంతాల్లో కాల్వగట్ల బలోపేతం పనులు కూడా చేయిస్తామని అధికారులు అంటున్నారు. మచిలీపట్నం, పామర్రు, బంటుమిల్లి, కృత్తివెన్ను తదితర ప్రాంతాల్లో పంట కాల్వలగట్లు బలహీనంగా ఉండటంతో కనీస మరమ్మతులు చేయాల్సి ఉంది. దివిసీమకు సాగునీటిని సరఫరా చేసే కేఈబీ ప్రధాన కాల్వ నుంచి శివారు ప్రాంతాలకు సాగునీటిని సరఫరా చేసే 9వ నెంబరు ప్రధాన కాల్వకు మరో 10 బ్రాంచ్ కాల్వలు ఉన్నాయి. చల్లపల్లి, ఘంటసాల, మచిలీపట్నం సౌత్ మండలాలకు ఈ బ్రాంచ్ కాల్వల ద్వారా సాగు, తాగునీరు అందుతుంది. ఈ 10 బ్రాంచ్‌ల కాల్వగట్లు భోగిరెడ్డిపల్లి, తుమ్మలచెరువు, పెదయాదర తదితర ప్రాంతాల్లో బలహీనంగా ఉన్నాయి. జిల్లాలో 226 సాగునీటి సంఘాలు ఉన్నాయి. నీటితీరువా ద్వారా వసూలైన నగదుతో పాటు ఇతరత్రా నిధులతో సాగునీటి, డ్రెయినేజీల పనులను సాగునీటి సంఘాల పర్యవేక్షణలో చేస్తే రైతులకు కొంతమేర ప్రయోజనం కలుగుతుంది.

అవుట్‌ఫాల్ స్లూయిస్‌లకు మరమ్మతుల సంగతేంటి?

అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు, నాగాయలంక మండలాల్లో పాలకాయతిప్ప వద్ద రత్నకోడు డ్రెయినేజీపై, గుల్లలమోద-నాలి గ్రామాల మధ్య మేకల కాల్వపై అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల నిర్మించేందుకు రూ.38.75 కోట్లతో అంచనాలు రూపొందించారు. మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోడూరు మండలంలో ఇటీవల పర్యటించారు. ఈ సమయంలో అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు పాడవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. దీంతో పాటు మచిలీపట్నం మండలంలోని కోన-వాడపాలెం గ్రామాల మధ్య కరకట్ట కింద ఉన్న రెండు అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల గేట్లు కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో తీరప్రాంతంలోని అవుట్‌ఫాల్ స్లూయిస్‌లకు ఈ వేసవిలోలైనా కనీస మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థి ప్రతిభ



చిత్రలేఖన పోటీలో ప్రోత్సాహక బహుమతి అందుకున్న మొహ్మద్ రహిల్ జయాన్

గుణదల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆలోచనలతో నేటి యువత రాణించాలని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య అన్నారు. ఎన్టీపీసీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రోత్సాహక బహుమతి సాధించిన మొహ్మద్ రహిల్ జయాన్‌ను పాఠశాల సిబ్బంది శుక్రవారం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య తెలిపారు. రహిల్ తన ప్రతిభతో పాఠశాల కీర్తిని మరింత పెంచాడని కొనియాడారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రోజ్ మేరీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిడమానూరు డబుల్ డెక్కర్‌పై నీలినీడలు

(5వ పేజీ తరువాయి)

అవకాశం ఉండదు. కానీ, మెట్రోకు ఇబ్బంది ఉండదు.

జాప్యం జరగకుండా ఉంటే..

నిడమానూరు ఫ్లై ఓవర్ విషయంలో కొంత జాప్యం జరిగింది. ఈ జాప్యం జరగకపోయి ఉంటే ఫ్లై ఓవర్ విషయంలో కేంద్రం పునరాలోచించే అవకాశం ఉండేది కాదు. డీపీఆర్ తయారైన తర్వాత చాలాకాలం వేచి ఉండటం వల్ల టెండర్లు పిలవలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కేంద్రం ఇది అవసరం లేని ప్రాజెక్టుగా భావించింది. కానీ, నగరానికి ఇది చాలా అవసరం. మహానాడు జంక్షన్ నుంచి దాదాపు చిన్నాపెద్దా కలిపి 12కు పైగా జంక్షన్లు ఉన్నాయి. ఆటోనగర్‌కు వెళ్లే వాహనాల కారణంగా జంక్షన్ల వద్ద రద్దీ ఏర్పడుతోంది. దీని కారణంగా ఈ మార్గంలో విజయవాడకు చేరుకోవాలంటే అరగంట సమయం పడుతోంది. అంతర్గత ట్రాఫిక్, ఆటోనగర్‌కు వెళ్లే వాహనాల కారణంగా ఈ మార్గంలో ఫ్లై ఓవర్ అవసరం చాలా ఉంది.

మెట్రో వెళ్లాలంటే డబుల్ డెక్కరే కావాలా?

మెట్రో లైన్ కారణంగా డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌పై అనవసరంగా కాలాతీతం చేశారేమోనన్న భావన కలుగుతోంది. ఎనికేపాడు నుంచి రామవరప్పాడు వరకు భవనాలు ఉండటం వల్ల ఎక్కువగా నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోంది. మార్జిన్ల వెంబడి మెట్రో కారిడార్ వేసే పరిస్థితి కూడా లేదు. కానీ, నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు ఫ్లై ఓవర్‌ను ఆనుకుని మెట్రో లైన్‌ను తీసుకెళ్లడమే పరిష్కారంగా ఉంది. రెండూ పక్కపక్కన ఉంటాయి. దీనికి అనుగుణంగా ఫ్లై ఓవర్ అలైన్‌మెంట్‌ను అటు, ఇటుగా జరిపితే సరిపోతుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

వర్షాందోళన

(5వ పేజీ తరువాయి)

నష్టపోకుండా ప్రతి ధాన్యం గింజను కొనేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని చెప్పారు. రైతుల సౌకర్యం కోసం నియోజకవర్గంలోని ప్రతి రైతు సేవా కేంద్రంలోనూ ధాన్యం పరిమాణానికి అనుగుణంగా 5 వేల నుంచి 7 వేల గోనె సంచులు అందుబాటులో ఉంచామని, నియోజకవర్గంలో జీపీఎస్ చేసిన 274 ట్రాక్టర్లు అందుబాటులో ఉంచామని, చల్లపల్లి మండలంలో 120, ఘంటసాలలో 122, మోపిదేవిలో 20, కోడూరులో 10 ట్రాక్టర్లను అందుబాటులో ఉంచామని, రైతులకు అన్ని విధాలా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. పలుచోట్ల మిషన్ కోత కోస్తున్న రైతులు రోడ్లపై, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టుకున్నారని, వర్షాల నేపథ్యంలో వీలైనంత త్వరగా ఆ ధాన్యాన్ని సేకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

ఎంపీపీ రాజీనామా ఆమోదం

విస్సన్నపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట ఎంపీపీ పిల్లి మెర్సి వనజాక్షి తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు గురువారం జడ్పీ సీఈవోకు రాజీనామా పత్రాన్ని అందించారు. ఆమె రాజీనామాను సీఈవో ఆమోదించినట్లు ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏలూరు ఆర్టీసీ డీజిల్ బంక్‌లో అవినీతి నిగ్గు తేల్చండి

» ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నేతల డిమాండ్

బస్‌స్టేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఆర్టీసీ డీజిల్ బంకులో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులను శిక్షించాలని ఏపీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోదర్‌రావు, జి.వి.నరసయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏలూరులో ఆర్టీసీ మేనేజ్‌మెంట్ 2021లో ఏర్పాటు చేసిన డీజిల్ బంకు నిర్వహణలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలిపారు. బంకులో విధులు నిర్వహించే వారంతా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులని, వారిపై కనీస పర్యవేక్షణ లేదన్నారు. ఆడిట్‌లో సుమారు రూ.82 లక్షల అవకతవకలు జరిగాయని నిర్ధారణ చేశారని తెలిపారు. దీనిపై వాస్తవాలను తెలిపి బాధ్యుల పై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రూ.82లక్షలను సంబంధిత సిబ్బంది తొమ్మిది మంది నుంచి రూ.50లక్షలు ఇప్పటికే వసూలు చేసి, వారిని కేసుల నుంచి తప్పించారన్నారు. డీజిల్ స్కామ్‌పై పూర్తి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కామ్‌కు పాల్పడిన వారిని వదిలేసి కింది స్థాయి అధికారులు, ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేయటం, వారిని సస్పెండ్ చేయటం సరైనది కాదన్నారు.

ఉద్యోగులపై సస్పెన్షన్ రద్దు చేయాలి

- ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

ఏలూరు ఆర్టీసీ డిపోలో ముగ్గురు ఉద్యోగులపై అక్రమ సస్పెన్షన్ రద్దుచేసి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జిలానీ బాషా, కట్టా సుబ్రహ్మణ్యంలు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యవహారంలో ఎటువంటి సంబంధం లేని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్.సుందరయ్య సహా మరో ఇద్దరు ఉద్యోగులను బాధ్యులుగా చేస్తూ సస్పెండ్ చేయటాన్ని తీవ్రంగా ఖండించారు.

స్త్రీనిధి స్వాహా

(5వ పేజీ తరువాయి)

సభ్యుల ద్వారా బుక్‌కీపర్ చేతివాటం విషయం అధికారులకు తెలియడంతో ఆమెను విధుల నుంచి తప్పించారు. అధికారులు విచారణ జరపగా, ఆమె సుమారు రూ.25 లక్షల నిధులు స్వాహా చేసిందని తేల్చి పైఅధికారులకు నివేదించారు. తాను నిధులను స్వాహా చేశానని ఒప్పుకొన్న సునీత గ్రూపు సభ్యుల డబ్బును విడతలవారీగా ఇస్తానని చెప్పి నమ్మించింది. తాను, తన కుటుంబసభ్యుల పేర్లతో ప్రామిసరీ నోట్లు ఇచ్చింది. ఎంతకీ అధికారులు తమకు న్యాయం చేయకపోవడం, సునీత డబ్బు ఇవ్వకపోవడంతో సభ్యులు.. గ్రామ టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్ ద్వారా ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను శుక్రవారం కలిసి విన్నవించుకున్నారు. దీనిపై పోలీసులు, పై అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు. పెనమలూరు మండలం మొత్తం మీద ఇలాంటి కుంభకోణాలు అనేకం జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లోతుగా విచారణ చేస్తే అన్నిచోట్లా స్త్రీశక్తి నిధుల స్వాహా వ్యవహారాలు బయటపడే అవకాశం ఉంది.

24న మహిళల సాఫ్ట్ టెన్నిస్

లబ్బీపేట, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ మహిళల లీగ్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.దిలీప్ తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మూడు విభాగాలలో లీగ్ జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్, జన్మదిన ధృవీకరణ పత్రంతో 24 ఉదయం 8గంటలకు హాజరుకావాలన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	125, 134, 140
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

పూర్తి సమాచారంతోనే ఇళ్లు అద్దెకు ఇవ్వండి

● కానూరు కొత్త ఆటోనగర్ ప్లాట్ ఓనర్స్‌కు అసోసియేషన్ నేతల వినతి

కానూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పూర్తి సమాచారం, తగిన ఆధారాలుంటేనే వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇవ్వాలని కానూరు కొత్త ఆటోనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు అసోసియేషన్ ప్రతినిధులు ప్లాట్ ఓనర్స్‌కు సమాచారం పంపారు. ఏదో ఫ్యాకల్టీరీలో కొంత మంది పని చేస్తున్నామని తమకు ఇళ్లు అద్దెకు ఇవ్వాలని ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చి అడిగితే తగు జాగ్రత్త వహించాలని సూచించారు. వారు ఏ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారో తెలిసుకొని ఆధార్‌కార్డుతోపాటు పని తాలుకా వివరాలను కూడా తీసుకోవాలని కోరారు. అద్దెకు వచ్చేవారికి ఏమైనా అనుమానం వస్తే అసోసియేషన్ ప్రతినిధులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్





ఉంగుటూరు ప్రజాదర్బార్‌లో ప్రజలనుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ.. ఉయ్యూరులో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉంగుటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు ప్రతివారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండల స్థాయి ప్రజాదర్బార్ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ ప్రజలనుంచి అర్జీలు స్వీకరించి వాటిలో చిన్నపాటి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు పంపించి చట్టపరిధిలో వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసింహారావు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొలుసు రవీంద్రబాబు, కుందేటి చంద్రశేఖర్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చిరుమామిళ్ల సూర్యం, గుజ్జర్లపూడి బాబూరావు, కోనేరు నాని, మేడేపల్లి రమ, అట్లూరి రామ్‌కిరణ్, ఈడ్పుగంటి కృష్ణమూర్తి, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, నెక్కలపు వెంకటరాజమన్నార్, తుమ్మల లత, గోగినేని విష్ణువర్ధనరావు మరడా పాపారావు అధికారులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: ప్రజాసమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం వెనుకాడేది లేదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి వినతులు, 76 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్వాకంతో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్న పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పరిష్కరించే ధ్యేయంతో పనిచేస్తుందన్నారు. పించనుకు సంబంధించి 30, టిడ్కో ఇళ్లు, నివేశన స్థలాలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, డ్రైయినేజి ఇతర సమస్యలకు సంబంధించి అర్జీలు రాగా సంబంధిత శాఖ అధికారులకు అందజేసి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపల్ ఛైర్మన్ వి సత్యనారాయణ, కమిషనర్ రామారావు, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు, మాజీ ఛైర్మన్ పూర్ణచంద్రరావు, ఏఎంసీ ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్, సీఐ రామారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జూన్ నాటికి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులందరికి వచ్చే సంవత్సరం జూన్ నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి అప్పగిస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. జెమినీ స్కూల్ సమీపాన టిడ్కో ఇళ్లను శుక్రవారం సందర్శించి నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిసెంబరు 15 నాటికి 384, జనవరి లో 384, ఫిబ్రవరిలో 408, మార్చిలో 408, ఏప్రిల్ 576, మేలో 336 ఇళ్లు పూర్తిచేసి అప్పగిస్తామన్నారు.



పంచాయతీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీపీవో అరుణ

స్వామిత్వ సర్వే సక్రమంగా నిర్వహించండి

కంకిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను సంబంధిత అధికారులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జె. అరుణ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం స్వామిత్వ సర్వేపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ, మండలంలోని వివిధ గ్రామాల్లో స్వామిత్వ సర్వేను సక్రమంగా, పటిష్టంగా నిర్వహిస్తు న్నామ న్నారు. ప్రజలు సైతం సర్వేకు సహకరించే విధంగా చూడాలన్నారు. అదే విధంగా పంచాయతీ ఇంటి పన్ను వసూళ్ల పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు.



ఘనంగా సత్యసాయిబాబా శత జయంతి

హనుమాన్‌జంక్షన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరానగర్ కాలనీలోని సత్యసాయి బాబా మందిరంలో శుక్రవారం సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాపులపాడు మండల సత్యసేవా సమితి కన్వీనర్ బెక్కం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు వేడుకగా నిర్వహించారు. అనంతరం బాబా చిత్రపటానికి జంక్షన్ పురవీధుల్లో కోలాటం, భజనల మధ్య రథోత్సవం, పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం నారాయణ సేవ జరిపారు. కార్యక్రమంలో మందిరం నిర్వాహకులు కోసూరి సుకుమార్, మామిడి రాము, పువ్వాడ ఫణికుమార్,నాగిరెడ్డి కృష్ణ, గొర్రెల భవాని, బెక్కం శ్రీలక్ష్మీముముక్షు భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నున్నలో వైద్యశిబిరం

విజయవాడ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నవజీవన్ బాలభవన్, పిన్నమనేని సిద్ధార్థ హాస్పి టల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నున్నలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలతో పాటు వైద్యులు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నున్న అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి, బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్‌బాబు, జోనల్ కో-ఆర్డినేటర్ దేవమణి, పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రి వైద్యులు వి. దివ్య, అజిత్, శృతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఆరుగొలను సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.బి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుగొలను సబ్‌స్టేషన్ పరిధిలోని ఆరుగొలను, ఓగిరాల, కురిపిరాల, సిరివాడ, తిప్పనగుంట, కానుమోలు, రంగయ్యప్పారావుపేట, కాకులపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

పేదల ఉపాధికి తోడ్పాటు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పేదల ఉపాధికి అవసరమైన తోడ్పాటును అందించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే పీఆర్కే ఫౌండేషన్ లక్ష్యమని ఆ ఫౌండేషన్ ఛైర్మన్ పారా రామకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక మూల కొట్టు సెంటర్‌లో కూరగాయల వ్యాపారం నిర్వహించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న టీడీపీ కార్యకర్త పిల్లి ద్వారకాబాయమ్మకు ఫౌండేషన్ ద్వారా తోపుడు బండిని రామకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, తుమ్మల ఉదయ్, వీరమాచనేని హరికృష్ణ, నాగళ్ల సతీష్, కొల్లి చంద్రశేఖర్, విష్ణుమోహన్, పిన్నిమనేని రమేష్ తదితరులు పాల్గొన్నారు. దంటగుంట్లలో రెడ్డి క్రాంతికుమారికి టిఫిన్ బండిని సర్పంచ్ యజ్ఞవరపు రంగరావు అందజేసినట్లు రామకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థికి పర్యావరణ పరిరక్షణపై అవగాహన ఉండాలని ఏపీఆర్డీసీ డైరెక్టర్ గరికపాటి శివశంకర్ అన్నారు. కానుమోలు మోడల్ హైస్కూల్ ఆవరణలో రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటి విద్యార్థులకు పంపిణీ చేశారు. శివశంకర్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రత్నకుమారి, సర్పంచ్ ఎనికేపల్లి సీతమ్మ, సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్, చిన్నం శ్రీదేవి, కటారి వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



అన్న సమారాధన పవిత్ర కార్యక్రమం

టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు

పెనమలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో అన్న సమారాధన అత్యంత పవిత్ర కార్యక్రమమని టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు పేర్కొన్నారు. శుక్రవారం పోరంకిలోని శ్రీఆంజనేయ భవానీశంకర సూర్యనారాయణస్వామి వారి దేవస్థానంలో జరిగిన కార్తీక అన్న సమారాధన కార్యక్రమంలో ఆయన సతీసమేతంగా పాల్గొని మాట్లాడారు. శివునికి ఇష్టమయిన కార్తీకమాసంలో శివార్చకులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిష్టగా శివార్చన చేస్తారని, ఆ శివుని ఆశీర్వాదాలు ప్రజలందరికీ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కాశీవిశ్వేశ్వరరావు, చక్రవర్తి, తోటకూర నరేంద్ర, వెలగా రంగారావు స్వామి, చెన్నుపాటి శ్రీనివాస్, దండమూడి సాయిసుధ, కంచర్ల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

విద్యార్థులు అభివృద్ధి పథంలో నడవాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

పెనమలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి చేసి, వినియోగించుకొని అభివృద్ధి పథంలో నడవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. శుక్రవారం తాడిగడప మునిసిపాలిటీలోని స్కాట్స్‌పైన్ పాఠశాలలో జరిగిన సింపోజియం 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను దర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతి, సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ ప్రతిమ చలసాని తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ వర్సిటీలో కొనసాగుతున్న వర్క్‌షాప్

కానూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇన్నోవేషన్, డిజైన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ థీమ్‌తో కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ సాగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి డీఈవోలు, డైట్ ప్రిన్సిపాల్స్, ఎస్ఈఆర్‌టీ సభ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. నిపుణులు డాక్టర్ రాజేష్ సామ్, వి. శ్రీవాత్సవ్, డాక్టర్ బిజయ్‌కుమార్ సాహు చర్చలో పాల్గొని ప్రసంగిస్తూ పాఠశాలల్లో ఆవిష్కరణల ప్రాధాన్యతను వివరించారు. పాఠశాలలు, పరిశ్రమలు, ప్రపంచ ఆవిష్కరణల నెట్‌వర్క్ మధ్య బలమైన సంబంధాలను తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

మీసేవా నిర్వాహకుడి మృతదేహం లభ్యం

ఉయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కనిపించకుండా పోయిన మీసేవా నిర్వాహకుడు కుంచెవరపు రవికుమార్ (52) మృతదేహం శుక్రవారం పుల్లేరుకాల్వలో లభ్యమైంది. గురువారం తెల్లవారు జామున ఇంటి నుంచి వెళ్లిపోయిన రవికుమార్ కన్పించక పోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు అతని కోసం వెతికి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేర ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించి కాల్వలో వెతకగా గుర్రపు డెక్క కింద లభ్యమైంది. మృతదేహాన్ని బయటకు తీయించి శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఈవో సేవలు అభినందనీయం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో దేవస్థానం మరింత అభివృద్ధి చెందే విధంగా విధులు నిర్వర్తించిన ఈవో వై. శ్రీనివాస్ సేవలు అభినందనీయమని స్థానిక నూజి వీడు రోడ్డు శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఫౌండర్ ట్రస్టీలు కాకాని అరుణ, తవ్వా పూర్ణచంద్రరావు అన్నారు. దేవస్థానం ఈవోగా పనిచేసిన వై.శ్రీనివాస్ ఇటీవల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఈవోను ఆలయ ట్రస్టీలు, దేవస్థానం అభివృద్ధి కమిటీ నేతలు, ఆలయ అర్చకులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అభివృద్ధి కమిటీ నాయకులు సుంకర సుభాష్ చంద్రబోస్, నందిగం స్వామి, యలమంచిలి శ్రీరామ చంద్రమూర్తి, గుమ్మడి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మెట్లపల్లి విద్యార్థులకు బహుమతులు



గన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో మెట్లపల్లి ఎంపీపీ పాఠశాల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. పద్యాల పోటీల్లో కోండ్రు నీలిమ, అన్నం హేమశ్రీ బహుమతులు సాధించగా వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు ఎ.రాజేష్‌ను హెచ్ఎం డి.బాల సుబ్బమ్మ, డీవైఈవో రవికుమార్, ఎస్ఎంసీ ఛైర్మన్ కె.నాగిని అభినందించారు.

గ్రీన్ అంబాసిడర్, గార్డులకు శిక్షణ

ఉయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్‌గార్డులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ అంశంపై కాటూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పారిశుధ్యంపై ఎంపీడీ వో శేషగిరిరావు, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు అవగాహన కల్పించారు. ఏఎంసీ ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ ఆశాజ్యోతి, ఎంపీటీసీలు సజ్జా అనూష, తోట శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గన్నవరం : పచ్చదనం పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో టి.స్వర్ణలత అన్నారు. దావాజీగూడెంలో మండలంలోని 105 మంది గ్రీన్ అంబాసిడర్‌లకు పచ్చదనం పరిశుభ్రత, చెత్త సేకరణపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో టి.భారతి, సర్పంచ్ బడుగు బాలమ్మ, పంచాయితీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఇంటిలో చెత్తను వేర్వేరుగా శానిటరీ సిబ్బందికి అందజేస్తూ వర్మి కంపోస్ట్ తయారీ ద్వారా సంపద సృష్టికి, పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ జోగేశ్వరరావు సూచించారు. ఎస్.ఎన్. పాలెంలో తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సమీకరించడాన్ని, సంపద తయారీ కేంద్రంలో పనులను క్షేత్రస్థాయిలో శుక్రవారం ఆయన పరిశీలించారు. సర్పంచ్ అడపా అంజిబాబు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు.

సాయం చేతకాదు..చేసేవారిపై విమర్శలా?

● వైసీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తిపై మహిళల ఆగ్రహం

పెనమలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేదవారి అభ్యున్నతికి సాయం చేయకపోగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రైతు బజార్ల ద్వారా పేదల కడుపు నింపేందుకు ప్రయత్నం చేస్తుంటే దేవభక్తుని చక్రవర్తికి ఇంత కడుపుమంట ఎందుకని రైతు బజారు లబ్ధిదారు మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పోరంకి చేపల కుండీల వద్ద వైసీపీ నేత దేవ భక్తుని చక్రవర్తి తన పార్టీ శ్రేణులతో ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే ఆక్రమిస్తున్నారంటూ రాద్ధాంతం చేసిన విషయంపై రైతు బజారు లబ్ధిదారు మహిళలు శుక్రవారం రైతుబజారు నిర్మిస్తున్న ప్రాంతానికి చేరుకొని తీవ్రస్థాయిలో చక్రవర్తిపై ధ్వజమెత్తారు. వారు మాట్లాడుతూ పేదవానికి పట్టెడన్నం పెట్టే ప్రయత్నం చేయకపోగా, ఆర్థిక ఉపాధి కల్పించే మార్గం చెప్పకపోగా పేదవారిని ఆదుకొనే ఎమ్మెల్యేపై దుష్ప్రచారాలు, లేనిపోని అభాండాలు చక్రవర్తి వేస్తున్నాడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రైతు బజారు లబ్ధిదారు మహిళలు, టీడీపీ కూటమి నేతలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు ఖచ్చితమైన తూకం ఇవ్వండి

ఉయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు ఖచ్చితమైన తూకంతో బియ్యం, ఇతర సరుకులు ఇవ్వాలని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ అధికారి ఎన్‌యు భాను ప్రసాద్ ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ షఫీని ఆదేశించారు. ఉయ్యూరులో ఎంఎల్ఎస్ పాయింట్ ను శుక్రవారం సందర్శించి కాటాలను తనిఖీ చేశారు. తుకాల్లో తేడా గురించి రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కాగిత కొండ ఆధ్వర్యంలో డీలర్లు కొద్దిరోజుల క్రితం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమేర అధికారులు ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ చేశారు. సంఘ నాయకులు పడమట వెంకటేశ్వరరావు, ముక్కు ప్రసాద్, యేసుబాబు, గఫూర్, వీరప్ప, కళ్యాణ్ తదితరులు అధికారులను కలసి సమస్యలు తెలియజేశారు.

లీగల్ మెట్రాలజీ అధికారుల ఒత్తిళ్లు ఆపాలి: ఖాసీం

కంకిపాడు : లీగల్ మెట్రాలజీ అధికారుల ఒత్తిళ్ల నుంచి రేషన్ డీలర్లను కాపాడాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సీ.హెచ్ ఖాసీం అన్నారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, గత నాలుగు రోజులుగా రేషన్ షాపుల్లోని వేయింగ్ మిషన్లకు స్టాంపింగ్ చేయాల్సిన లీగల్ మెట్రాలజీ అధికారులు చేతి వాటానికి పాల్పడుతున్నారన్నారు. వేయింగ్ మిషన్లకు స్టాంపింగ్ చేసే సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన రూ. 400 తీసుకోవాల్సి ఉంది. అయినా రేషన్ డీలర్ల లీగల్ మెట్రాలజీ అధికారులకు బల వంతంగా రూ. 1000 వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం వసూలు చేయాల్సిన దానికంటే అదనంగా రూ. 600 వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న లీగల్ మెట్రాలజీ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మధుసూదనరావు సేవలు విద్యార్థులకు స్ఫూర్తి

గన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా సేవలందించిన వై.మధుసూదనరావు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ఏవోగా వై.మధుసూదనరావు పనిచేయటంతో పాటు గత 30 ఏళ్లు ఎన్ఎస్ఎస్ అధికారిగా సేవలందించిన ఆయనను శుక్రవారం ఘనంగా దుశ్శాలువాలతో సత్కరించారు. హెచ్‌వోడీలు డాక్టర్ ప్రభాత్, డాక్టర్ కోటేశ్వరరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

ఉయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగిసిన సందర్భంగా శుక్రవారం పోలిని సాగనంపి శివాలయంలో భక్తులు పూజలు చేశారు. కాల్వలు, చెరువుల్లో మహిళలు కార్తీక దీపారాధనలు వదిలి పోలిని సాగనంపి అనంతరం శివాలయాల్లో పూజలు చేశారు. శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంతో పాటు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

విద్యార్థినులకు నగదు బహుమతులు

ఉయ్యూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇద్దరు డిగ్రీ విద్యార్థినులకు వి.బసివిరెడ్డి రూ. 20 వేల విద్యాప్రోత్సాహక బహుమతి అందజేశారు. క్లబ్ కార్యాలయ ఆవరణలో శుక్ర వారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెక్కులు అందజేశారు.



గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ యునైటెడ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

లబ్బీపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో త్వరలోనే లక్ష అడుగుల కన్వెన్షన్ సెంటర్ అధునిక టెక్నాలజీతో ప్రారంభించనున్నామని మంత్రి టి.జి.భరత్ తెలిపారు. ఎస్ఎస్ కన్వెన్షన్‌లో మూడురోజుల పాటు జరిగే ఏపీ బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ యునైటెడ్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మంత్రి భరత్ మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన జ్యూయలరీ వర్తకులకు అభినందనలు తెలియజేశారు. మంత్రి లోకేశ్ చొరవతో త్వరలోనే అమరావతిలో కన్వెన్షన్ సెంటర్ ప్రారంభిస్తున్నామన్నారు. మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ మూడు రోజులు జరిగే ప్రదర్శనలో అత్యాధునిక నగల డిజైన్లను అందరూ తెలుసుకోగలుగుతారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే అతి పెద్ద బి2బి జ్యూయలరీ ప్రదర్శన అన్నారు. ప్రాంతీయ జ్యూయలర్స్ ఎక్కడికో వెళ్లకుండా ఈ ప్రదర్శనలోనే నగలను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుదన్నారు. నగల వ్యాపారలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసోసియేషన్ చీఫ్ స్టేట్ ఆర్గనైజర్ శాంతిలాల్ జైన్, జనరల్ సెక్రటరీ శంకరరావు బొమ్మిశెట్టి, ట్రజరర్ సేఠ్ అనిల్ కుమార్, యునైటెడ్ ఎగ్జిబిషన్స్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ వి.కె.మనోజ్, సిఇఒ మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీసు టీచర్ల పరీక్ష ఫీజు గడువు 24

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌సర్వీసులో ఉన్న టీచర్లు సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె.రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిసెంబరులో నిర్వహించనున్న హెడ్‌మాస్టర్స్ అకౌంట్ టెస్ట్‌కు హాజరయ్యే ఉపాధ్యాయులు రెండు పేపర్లకు ఈనెల 24లోగా రూ.150 చెల్లించాలన్నారు. ఒక్క పేపరుకు రూ.100 ఫీజు చెల్లించాలన్నారు. దరఖాస్తులను 25వ తేదీన డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఎస్‌జీటీటీ కేడర్‌లోని ఇన్‌సర్వీసు టీచర్లకు ప్రొఫెషనల్ అడ్వాన్సుమెంట్ టెస్ట్‌కు ఈనెల 26 వతేదీలోగా రూ.200లు పరీక్ష ఫీజు చెల్లించాలని, 27లోగా డీఈవో కార్యాలయానికి దరఖాస్తులు పంపుకోవాలన్నారు. ఆటోమెటిక్ అడ్వాన్సుమెంట్ టెస్టుకు హాజరయ్యే గ్రేడు-2 పండిట్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఆర్ట్, క్రాఫ్ట్ , టైలరింగ్ పరీక్షలకు హాజరయ్యే టీచర్లు, సింపుల్ ఓరియెంటేషన్ టెస్ట్‌కు హాజరయ్యే గ్రేడు-2 భాషా పండితులు 26 లోగా రూ.200 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

రప్పా.. రప్పా అంటే ఒక్క సీటే : జగన్‌పై ఉమా వ్యాఖ్యలు



గొల్లపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిద్ధం.. సిద్ధం అని జబ్బలు చరుచుకున్న జగన్‌కు ప్రజలు 11 సీట్లే ఇచ్చారని, రప్పా.. రప్పా అంటే ఒక్క సీటుకే పరిమితం చేస్తారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. గొల్లపూడిలోని కార్యాలయంలో శుక్రవార ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.వేల కోట్లు దోచేసి.. సాక్షి, భారతి సిమెంట్స్‌లో జగన్‌రెడ్డి పెట్టుబడులు పెట్టారని దుయ్యబట్టారు. ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూములు దోచుకొని ఆర్థిక ఉగ్రవాదానికి జగన్ రెడ్డి పాల్పడ్డాడన్నారు. జగన్ ఆర్థిక నేరాలపై 11 సీబీఐ, 9 ఈడీ ఛార్జి షీట్లు దాఖలయ్యాయన్నారు. అక్రమ ఆస్తుల కేసులో జగన్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యాడని చెప్పే దమ్ము, ధైర్యం బ్లూ మీడియాకు లేదన్నారు. తనకు ఫోనే లేదని చెప్పిన జగన్ రెడ్డి యూరప్ పర్యటన సందర్భంగా న్యాయస్థానానికి ఇచ్చిన నెంబర్ ట్రాక్ కాలేదన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు చేసినందుకు తనపై తండ్రీకొడుకులు 90 కేసులు పెడితే 19 ఏళ్లుగా వాయిదాలకు తిరుగుతున్నానని ఉమా తెలిపారు.

దుబాయ్, దోహాలకు విమానాలు నడపాలి

● సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడులకు ఎమ్మెల్యే బొండా ఉమా లేఖ



అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గన్నవరం విమానాశ్రయం నుంచి దుబాయ్, దోహాలకు విమాన సర్వీస్‌లు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడులకు శుక్రవారం లేఖ రాశారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విమాన సర్వీస్‌ల పెంపుదల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. హైదరాబాద్ నుంచి ప్రయాణం సాగించడం వలన ఆరు గంటల సమయం వృధా అవుతోందన్నారు. ఎమిరేట్స్, ఖతార్, ఇండిగో, ఎయిర్ ఇండి యా వంటి ఎయిర్‌లైన్స్ సంస్థలతో మాట్లాడి దుబాయ్, దోహాలకు విమాన సర్వీస్‌లు ఏర్పాటు చేస్తే అంతర్జాతీయ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. న్యూ ఇయర్ గిఫ్ట్‌గా గన్నవరం నుంచి దుబాయ్, దోహాలకు విమాన సర్వీసులు నడపాలని కోరారు.

కోతులను తరిమికొట్టేందుకు చింపాంజీ వేషం

● అనమనపూడిలో మిల్కీ చొరవకు అభినందనల వెల్లువ



చింపాంజీ వేషంలో ఉన్న పోలిమెట్ల మిల్కీని అభినందిస్తున్న ఎంపీడీవో, ఈవోపీఆర్డీ

నందివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నందివాడ మండలంలో కోతుల బెడ ద ఎక్కువగా ఉంది. కోతులు గుంపులుగుంపులుగా తిరుగుతూ పంటలను నాశనం చేయడమే కాకుండా ఇళ్లలోకి వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రజ లు పడుతున్న ఇబ్బందులను గమనించిన అనమనపూడికి పోలిమెట్ల మిల్కీ స్వచ్ఛందంగా తానే చింపాంజీ వేషం ధరించి గ్రామం మొత్తం కలియతిరగడంతో కోతులు గ్రామాన్ని విడిచిపోయాయి. పోలిమెట్ల మిల్కీ చొరవతో కోతుల బెడద వదిలిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని గ్రామ కార్యదర్శి రమేష్ తెలిపారు. నందివాడలో పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో మల్లేశ్వరి, ఈవోపీఆర్డీ అమీర్ మీర్జా బాషా మిల్కీని అభినందించారు.

తహసీల్దార్ చొరవతో యానాదులకు ఆధార్



ఆధార్‌కార్డులు ఇచ్చేందుకు యానాదులను పిలిపించిన తహసీల్దార్ కుసుమకుమారి

తోట్లవల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులోని కృష్ణానది ఒడ్డున గుడెసెలు వేసుకుని నివసిస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకుంటూ, చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్న యానాదులు ప్రభు త్వం నుంచి ఒక్క సంక్షేమ పథకం ఎరుగరు. పిల్లలు బడికి వెళ్లిఎరుగరు. పెద్దలకు ఓటు హక్కు లేదు. ఇటీవల తుపానుకు అధికారులు తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్‌కి తీసుకువచ్చి భోజనం ఏర్పాటు చేసి ఆదుకున్నారు. వారి స్థితిగతులను తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలుసుకున్నారు. శుక్రవారం తన కార్యాలయానికి తీసుకువచ్చి ఆధార్‌కార్డుల కోసం దరఖాస్తు చేయించారు. ఆధార్ వచ్చాక రేషన్‌కార్డులు ఇస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందేందుకు అవకాశం లభిస్తుందని ఆమె తెలిపారు.



సిటీ బస్‌పోర్టు వద్ద ఆటోలు నిలిపి ఉంచడంతో ఆగిపోయిన బస్సులు



సిటీ బస్‌పోర్టులోకి వచ్చేసిన ఆటోలు

సిటీబస్ పోర్టులో ఆటోల తిష్ట

● ఆటోల అడ్డగోలు పార్కింగ్ ● స్తంభిస్తున్న ట్రాఫిక్ ● బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ● కళ్లు మూసుకున్న ఆర్టీసీ అధికారులు

బెజవాడ సిటీ బస్‌స్టేషన్‌లోకి రోజూ వందల సంఖ్యలో బస్సులు వచ్చి వెళ్తుంటాయి. సిటీబస్సు పోర్టు లోపలికి వచ్చే మార్గంలో ఆటోలు అడ్డంగా నిలిపివేయడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలగడమే కాకుండా ట్రాఫిక్ స్తంభించి పోతుంది. కంట్రోల్ రూమ్ మొదలు సిటీబస్సు స్టేషన్లలో బస్సులు వెళ్లాల్సిన కాల్వ వంతెన మీద, బస్సుపోర్టు ముఖ ద్వారంలోను ఆటోలు అడ్డగోలుగా పెట్టడమే కాకుండా బస్సుపోర్టులోకి సైతం వచ్చేస్తుండడంతో సిటీ బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోల అడ్డగోలు పార్కింగ్ తలనొప్పిగా తయారైంది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

పీఎన్‌బీఎస్ సిటీ బస్‌పోర్ట్‌లోకి ప్రైవేటు వాహనాలకు అనుమతి లేదు. సిటీ బస్‌పోర్ట్ పక్కగా ప్రైవేటు వాహనాలు వెళ్లడానికి, కొంత సమయం వేచి ఉండడానికి మార్గం ఏర్పాటు చేశారు. ఆటోడ్రైవర్లు మాత్రం ఆ దారిని వాడుకోకుండా బస్‌స్టేషన్ ప్రధాన మార్గంలో అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారు. ప్రయాణికులను దింపడానికి, పికప్ చేసుకోవడానికి సిటీ బస్‌పోర్ట్ లోపలికే వచ్చి ప్రయాణికుల కోసం వేచి చూస్తూ అడ్డగోలుగా పార్కింగ్ చేసున్నారు. దీంతో బస్సులకు అడ్డుపడడంతో పాటు ఆర్టీసీ ఆదాయం కూడా కోల్పోతోంది.



ప్రయాణికులకు అడ్డు తగులుతున్న ఆటో డ్రైవర్లు

నేరుగా బస్‌పోర్ట్‌లోకే ఆటోలు!

అధికశాతం ఆటోలు ఏకంగా సిటీ బస్‌పోర్ట్‌లోకి ప్రవేశిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు, రైతుబజారుకు వెళ్లే పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటోలు గుంపుగా లోపలికి వస్తుండడంతో వంతెనపై ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఒక్కోసారి ఆటోలను బస్సుల ముందే ఆపేస్తున్నారు. పార్కింగ్‌కు అనుమతి లేకపోయినా నచ్చిన చోట అడ్డంగా ఆపుతూ ప్రయాణికులు, బస్సుల రాకపోకలకు ఆటో డ్రైవర్లు ఇబ్బంది కలిగిస్తున్నారు. బస్‌పోర్ట్‌లో దిగి ప్రయాణికులు బయట వచ్చేలోపు ఆటో డ్రైవర్లు వారి చుట్టూ చేరి ఇబ్బంది పెడుతున్నారు.

వంతెనపైనా అక్రమ పార్కింగ్

కూడలి నుంచి బస్‌పోర్ట్‌లోకి వెళ్లి వచ్చే కాలువ వంతెనపై ఆటోలను అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. అక్కడ పార్కింగ్‌కు ఎలాంటి అనుమతులు లేవు. వంతెనపై ఫుట్‌పాత్‌ను ఆనుకుని పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పక్కనే పోలీసు కంట్రోల్ రూం ఉన్నప్పటికీ చర్యలు శూన్యం. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మూడు గేట్ల వద్ద ఇదే పరిస్థితి. హైవేపైనా అడ్డుగోలుగా నిలిపేస్తూ బయటకు వచ్చే ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒకే విద్యార్థి, ఒకే టీచర్!

● అవిరిపూడి ప్రాథమిక పాఠశాల(ఏపీ) దుస్థితి
● మొవ్వ మండలంలోని స్కూళ్లలో విద్యార్థుల కొరత
● పెక్కు సంఖ్యలో మూతపడనున్న పాఠశాలలు

పల్లెల్లో ప్రాథమిక పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా సర్కారు బడుల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపడం లేదు. పిల్లల హాజరు తక్కువగా ఉండడానికి ఇదొక కారణమైతే, పాఠశాలల విలీనం మరొక కారణం. ఈ పరిస్థితుల్లో ఒకరిద్దరు విద్యార్థులు ఉన్న పాఠశాలలు పెరిగిపోయాయి. చాలా పాఠశాలలు మూసివేతకు దగ్గరగా ఉన్నాయి. తల్లిదండ్రులు తమ వైఖరిని మార్చుకుని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పల్లెల్లో ప్రభుత్వం పాఠశాలలు మూతపడితే ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని గమనించాలి.

(ఆంధ్రజ్యోతి-కూచిపూడి)



ఒక విద్యార్థి మాత్రమే ఉన్న అవిరిపూడి ఎంపీ ఎలిమెంటరీ స్కూల్



మంత్రిపాలెంలో ఇద్దరు విద్యార్థులతో ఉపాధ్యాయుడు

విద్యార్థుల హాజరు లేకపోవటం వల్ల మొవ్వ మండలంలో పలు ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితులు కన్పిస్తున్నాయి. అవిరిపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఏపీ)లో ఒక విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. మంత్రిపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో ఒకటి, రెండు తరగతులకు ఒకటో తరగతిలో ఒక విద్యార్థి, రెండో తరగతిలో ఒక విద్యార్థి మాత్రమే ఉండటంతో వీరిద్దరికి ఒక ఉపాధ్యాయుడు పని చేస్తున్నాడు. మండలంలో మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలలు 55 ఉండగా, అందులో 35 పాఠశాలల్లో సింగిల్ టీచర్లే ఉన్నారు. 25 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో సింగిల్ టీచర్లనే ప్రభుత్వం నియమించింది. విద్యార్థులు ఒకరిద్దరు ఉన్న పాఠశాల్లో ఉపాధ్యాయులకు పని లేకపోవటం, 20 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఒక్కరే ఉపాధ్యాయుడు పని చేస్తుండటం, ఒకరికి పని లేకపోవటం, మరొకరికి పని భారం అధికంగా కనిపిస్తుంది. అవిరిపూడి ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు 10 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నా రు. నిడుమోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు 12 మంది విద్యార్థులుండగా, ఒక్క ఉపాధ్యాయురాలు విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణలో లోపం కనిపిస్తోంది.

హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి

● సీఎంకు సీపీఐ నేత ఈశ్వరయ్య లేఖ

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దాదాపు 16 వేల మంది హోం గార్డుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం హోంగార్డులకు రోజుకు రూ.1,124 వేతనం, యూనిఫామ్, వాషింగ్, కవాతు అలవెన్స్, టీఏ, డీఏలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని కోరారు. హోంగార్డుల కుటుంబాలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ చేసిన హోంగార్డులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తోపాటు పెన్షన్ ఏర్పాటు చేయాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

ప్రత్యేకాధికారుల పదవీకాలం గడువు పెంపు

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రాజాం, రాజమహేంద్రవరం, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, బాపట్ల, గూడూరు పట్టణ స్థానిక సంస్థల ప్రత్యేక అధికారుల పాలనా గడువు నవంబరు 5తో ముగియడంతో మరో ఆర్నెల్లు గడువు పెంచుతూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మే 5, 2026 వరకు కానీ, ఈ లోపు ఎన్నికలు జరిగితే అప్పటి వరకు గానీ ప్రత్యేకాధికారులు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీఎస్సీ, బీటెక్ కోర్సులకు మాన్యువల్ కౌన్సెలింగ్ 24 నుంచి

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏపీఈఏపీసెట్-2025 ర్యాంకుల ఆధారంగా బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ ప్రవేశాలకు చివరి విడత మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 24, 25, 27, 28, 29, 30 తేదీల్లో జరుగుతుందని రిజిస్ట్రార్ ఎంవీ రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

న్యాయవ్యవస్థను బెదిరించేలా జగన్ రెడ్డి ప్రవర్తన

● కె.నాగుల్ మీరా

వన్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత న్యాయవ్యవస్థను బెదిరించే విధంగా పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి ప్రవర్తన ఉందని, అతనిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని ఏపీ నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగుల్ మీరా అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో నాగుల్‌మీరా శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

జగన్మోహన్ రెడ్డి హైదరాబాద్‌లో సీబీఐ కోర్టు వెలుపల వ్యవహరించిన తీరును సభ్యసమాజం అసహ్యించుకుంటుందన్నారు. జగన్ కోర్టు వాయిదాకు హాజరయ్యే సమయంలో కావాలనే లా అండ్ ఆర్డర్ సమస్యను సృష్టించాడని ఆరోపించారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ లు, న్యాయవాదులు జగన్ కోర్టు వెలుపల వ్యవహరించిన తీరును ఖండించాలన్నారు.


మావోయిస్టుల కదలికల నేపథ్యంతో సచివాలయం, అసెంబ్లీ వద్ద భద్రత కట్టుదిట్టం

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా, పలువురు నేతలు ఎదురుకాల్పుల్లో మరణించడం, రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల నేపథ్యంలో అమరావతి, సచివాలయం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. సచివాలయంలోపలికి వచ్చి వెళ్లే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సరయిన ఐడీకార్డులు చూపిన తర్వాతే అనుమతిస్తున్నారు. అదేవిధంగా వాహనాల తనిఖీని కఠినతరం చేశారు. సచివాలయానికి వచ్చే వాహనాలను సచివాలయ భద్రతా సిబ్బంది నిశితంగా పరిశీలిస్తున్నారు. సచివాలయం, అసెంబ్లీ భద్రత కోసం 225 మంది ఎస్‌పీఎఫ్ సిబ్బందిని వినియోగిస్తుండగా జనరల్ షిఫ్ట్‌లో 90 మంది, మిగిలిన షిఫ్ట్‌లలో 40 మంది చొప్పున 24 గంటలు పహారా కాస్తున్నారు. సచివాలయం, అసెంబ్లీ వద్ద భద్రత కట్టుదిట్టం చేశామని, క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే సచివాలయం లోపలికి అనుమతిస్తున్నామని సచివాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మల్లికార్జునరావు తెలిపారు.



బైక్ యాత్రికుడు విజయానంద్‌కు సత్కారం

కృష్ణలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైజాగ్ నుంచి కన్యాకుమారి, ధనుష్కోడి వరకు బైక్‌పై వెళ్లి వచ్చిన కాకర్ల విజయానంద్ (63)ను శుక్రవారం 21వ డివిజన్ టీడీపీ నాయకుల ఘనంగా సత్కరించారు. కాకర్ల మాట్లాడుతూ వైజాగ్ నుంచి ధనుష్కోడి వరకు 12 రోజులు బైక్‌పై వెళ్లి రావడానికి సమయం పట్టిందన్నారు. ఎనిమిది సంవత్సరాలుగా బైక్‌పై దూరప్రయాణాలు కొనసాగిస్తున్నటు చెప్పారు. వైజాగ్ నుంచి లడక్‌కు మూడు సార్లు వెళ్లివచ్చినట్లు తెలిపారు. కాకర్లను టీడీపీ నాయకులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులు కొర్రా అప్పన్న, వేములపల్లి రంగారావు, జీవన్, పోడూరి పవన్, గొరిపర్తి నామేశ్వరరావు, కేశనం భావన్నారాయణ, అన్నే రమణ, సూర్యదేవర నాగేశ్వర రావు, మిఠాయి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గురివిందగుంటలో రోడ్డు పక్కన నిల్వచేసిన ధాన్యం, హడావిడిగా ధాన్యం పడుతున్న రైతులు

ఎక్కడి ధాన్యం అక్కడే!

● వాయుగుండం నేపథ్యంలో రైతుల గుండెల్లో రైళ్లు ● మిల్లులకు తరలింపునకు ఎదురుచూపులు

పెడన రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు తాము పండించిన ధాన్యం రోడ్ల పక్క నిల్వపెట్టి తరలించేందుకు ఎదురుచూపులు చూస్తున్నారు. గురివిందగుంట, కొంగంచర్ల గ్రామాల్లో రోడ్ల పొడవునా ధాన్యం రాశులు కన్పిస్తున్నాయి. మరికొన్ని చోట్ల సంచులలో ఉంచి లారీలు కోసం ఎదురు చూస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు అధికారులు వచ్చి ఎప్పటి ధాన్యం అప్పుడే మిల్లులకు తరలిస్తామని చెపుతున్నప్పటికీ ఆచరణలోకి రావటంలేదని రైతులు వాపోతున్నారు. వాతావరణంలో మార్పు రావటం, ఆకాశంలో మబ్బులతోగుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయని కవిపురం పీఏసీఎస్ ఛైర్మన్ పుట్టి శ్రీనివాసరావు అన్నారు. మళ్లీ వాయుగుండం నేపథ్యంలో చేతికొచ్చిన పంట ఏమౌతుందో అని రైతులు భయపడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంచుల కొరత వెంటాడుతోందన్నారు. సంచుల కొరత లేకుండా ఎప్పటి ధాన్యం అప్పుడు మిల్లులకు తరలించాలని కలెక్టర్ చెప్పారన్నారు.

మండలంలో ఇప్పటి వరకు ఏడు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని అధికారులు తెలిపారు. మండలం మొత్తం 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.



యోగాసనాల పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సత్యానందం

చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ నిషేద చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, ఏఆర్‌టీ-సరోగసీ చట్టాల అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు, రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం హాజరైన సమావేశంలో కమిటీ ఛైర్మన్, కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నిరు. అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని, ఫిర్యాదులు వస్తే త్వరితగతిన విచారించి, తగు చర్యలు తీసుకోవాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, చట్టంలోని నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్కానింగ్ కేంద్రాల కొత్త రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన 12 దరఖాస్తులను, 13 రెన్యువల్ దరఖాస్తులను, 19 మార్పు చేర్పుల దరఖాస్తులను కమిటీ పరిశీలించి చర్చించి ఆమోదం తెలిపింది. సరోగసీకి సంబంధించిన నాలుగు దరఖాస్తులకు కమిటీ ఆమోదం తెలిపింది. స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు, రెన్యువల్‌కు, మార్పులు, చేర్పులకు వచ్చే దరఖాస్తులను క్షుణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే కమిటీకి నివేదించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.సుఖ ప్రసవానికి యోగాసనాలు దోహదం చేస్తాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గర్భిణులకు ఉపయోగపడే యోగాసనాల పోస్టరును కమిటీ సభ్యులతో కలి సి ఆయన ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వాసవ్య ప్రతినిధి జి.రేష్మీ, డాక్టర్ పద్మజ, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవో డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ హబ్ ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)కు సంబంధించి ఎనికేపాడులోని స్పోక్ ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ వుంటుందని, హబ్ స్ఫూర్తికి అనుగుణంగా కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎనికేపాడులోని ఆర్‌టీఐహెచ్-స్పోక్ కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా సందర్శించారు. ఫిఫ్త్ ఏఐ టెక్నాలజీస్ స్టార్టప్‌నకు సంబంధించి కో-వర్కింగ్ స్పేస్‌ను ప్రారంభించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఆర్‌టీఐహెచ్, ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాల మధ్య ఎంవోయూ కుదిరింది. అనంతరం ఆర్‌టీఐహెచ్ బృందం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇప్పటి వరకు సాధించిన ప్రగతితో పాటు భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇప్పటికే ఎనిమిది ప్రముఖ విద్యాసంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. తొమ్మిది అవుట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. స్టార్టప్‌లు, ఎంట్రపెన్యూర్స్ నుంచి 264 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే 100కు పైగా స్టార్టప్‌లను వివిధ అనుసంధానించామన్నారు. తొలిదశ పెట్టుబడులకు ఇబ్బందిలేకుండా వివిధ కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. బ్యాంకులతోనూ అనుసంధానమవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడంపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. హ్యాక్‌థాన్ నిర్వహణకు కూడా స్పోక్ ద్వారా ప్రయత్నాలు జరుగుతున్నాయని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. ఈ సమావేశంలో సీఈవో జి.కృష్ణన్, ఇంక్యుబేషన్ హెడ్ డి.రవితేజ, ఫైనాన్స్ హెడ్ హిమబిందు, స్పోక్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలి

గుడివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌ల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హులకు అనుమతులు మంజూరు చేయాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దరఖాస్తుదారులపై అనవసరంగా భారాన్ని మోపకుండా, పారదర్శకంగా, సమయపాలనతో పనులు పూర్తి చేయాలని సూచించారు. అనధికార లేఅవుట్‌లు, బిల్డింగ్ డివియేషన్లు, పట్టణ ప్రణాళిక నియామావళి ఉల్లంఘనలపై సిబ్బంది మరింత కట్టుదిట్టంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె.ఎసుబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, లైసెన్స్ ఇంజినీర్లు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సంపత కుమారి

మొవ్వ పంచాయతీలో తనిఖీ

కూచిపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మొవ్వ పంచాయతీ కార్యాలయాన్ని డీఎల్‌పీవో సంపతకుమారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటి పన్ను వసూళ్ల ముమ్మరం చేయాలని, కూచిపూడి - మొవ్వ వెళ్లే రహదారిలో హోలీస్పిరిట్ పాఠశాల వద్ద చెత్త పేరుకుపోయి డంపింగ్ యార్డుల తయారైందని, చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి సోమేశ్వరరావును ఆదేశించారు. అనంతరం ఆమె మొవ్వ మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ గ్రామాల అభివృద్ధిపై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛ గ్రామాల అభివృద్ధికి, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను సేకరణ, విభజన మొదలగు అంశాలపై డెమో తరగతులు జరిగాయి. ఎంపీపీ కొండేటి ఇందిర, డిప్యూటీ ఎంపీడీవో త్రినాథ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

లింగవరం ఆర్ఎస్‌కేను పరిశీలించిన ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పండించిన వరి ధాన్యాన్ని రైతులు సక్రమంగా విక్రయించుకోవటానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. లింగవరం ఆర్ఎస్‌కేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడుతూ పండించిన ధాన్యాన్ని వెంటనే ఆర్ఎస్‌కేల్లో పంపించటానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొంతమంది రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు ఉన్నాయని, సంచులు లేవని, ట్రాన్స్‌పోర్టు సౌకర్యం సక్రమంగా లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన అధికారులతో మాట్లాడారు. లింగవరం గ్రామానికి అవసరమైన సంచులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్డీవో శ్రీనివాసరావుతో మాట్లాడుతూ, పండించిన ధాన్యం ఆయా మిల్లులకు పంపించేలా చూడాలని, ఆర్ఎస్‌కె సెంటర్లలో కోరిన వెంటనే లారీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఏ రైతు ఇబ్బందులు పడకూడదని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతు బాగుంటే తమ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షులు వాసే మురళీ, కూటమి నాయకులు జగన్మోహనరావు, పంద్రాజు సాంబశివ రావు, గాదిరెడ్డి చిరంజీవిరెడ్డి, ఎం.గోపాలస్వామి, మార్కు రాజు, కాటూరి ఏసుపాదం, తారక రామారావు, కలపాల మాణిక్యా లరావు, రవికుమార్, జగన్, బోనం సురేష్, సూర్యమోహనరావు, కోటయ్య, ఏడీఏ సూరపనేని కవిత, తహసీల్దార్ కిరణ్, ఆర్డీవో శ్రీనివాస రావు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



లింగవరంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

గుడివాడ: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం గౌతులచ్చన్న విగ్రహం (పాత సంత బజారు రోడ్డు) వద్ద 16,17,18 వార్డులకు సంబంధించి ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాలు, గృహనిర్మాణ, రేషన్ కార్డుల సమస్యలపై 94 అర్జీలు వచ్చాయి. ఎమ్మెల్యే మాటాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వార్డుల్లో ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తా మన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య లను తగ్గించామని, కోట్లాది రూపాయలతో గ్రామాల్లో రహదారులను నిర్మిస్తున్నామని, విద్యుత్ సమస్యలను పరిష్కరించామన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, ఎన్‌టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, కూటమి పార్టీల నాయకులు, ఆయా వార్డుల నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధనియాలపేటలో..

పట్టణ శివారుల్లోని డ్రెయినేజీ, తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ధనియాల పేటలో ద్విచక్ర వాహనంపై ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచినీటి సరఫరాలో ఎదు ర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరించి, వార్డుల్లో ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్ల పరిరక్షణ బాధ్యత గ్రామస్థులదే : కలెక్టర్

పమిడిముక్కల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రూ.కోట్లతో నిర్మిస్తున్న రోడ్లను పరిరక్షించుకోవలసిన బాధ్యత గ్రామస్థులపై ఉందని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. రూ2.5కోట్ల నాబార్డు నిధులతో చోరగూడి నుంచి గోపాలకృష్ణా పురం మీదుగా గూడపాడు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ ఎస్ఈ రమణారావు, డీఈ మోజెస్, ఏఈ భరద్వాజ్, సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారితో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డుపై దమ్ముచక్రాలతో ట్రాక్టర్లు తిరగకుండా నిరోధించాలని, తిరిగే జరిమానా విధించాలని సూచించారు. తహసీల్దార్ నవీన్‌కుమార్, టీడీపీ నాయకుడు కందిమళ్ల సుబ్రమణ్యేశ్వ రరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలత్తెనీయొద్దు : ఆర్డీవో

కూచిపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హెలాషారోన్ అధికారులను, రైతు సేవా కేంద్ర సిబ్బందిని ఆదేశించారు. భట్లపెనుమర్రు రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి రైతుతో మాట్లాడారు. సంచుల కొరతకు సంబంధించిన ఇబ్బందులను రైతులు ఆమె దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ మస్తాన్, ఏవో సురేష్‌బాబు నాయక్, డీటీ సీహెచ్ రఘురామ్, రైతులు పాల్గొన్నారు.



భట్లపెనుమర్రు రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న ఆర్డీవో హెలా షారోన్

తడి, పొడి చెత్తను వేరుచేయటంపై అవగాహన

గుడివాడ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విజువలీ క్లీన్ విలేజ్‌గా రామన్నపూడిని ఎంపిక చేసినట్లు ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. శుక్రవారం రామన్నపూడిలో ప్రతీ ఇంటికి తిరిగి తడి, పొడి చెత్త ఏ విధంగా వేయాలి, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్స్, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలు చెత్త రెండు రకాలుగా వేసినట్లైతే తీసుకెళ్లే సిబ్బందికి వీలుగా ఉంటుందని తెలిపారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి గ్రామపంచాయతీలో పొడి, తడి చెత్త ఏ విధంగా వేరు చేయాలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, సర్పంచ్ మీగడ మురళీధర్, టీడీపీ మండల అధ్యక్షులు వాసే మురళీ, జనసేన నాయకులు ఇంతేటి గజేంద్ర, రామన్నపూడి మాజీ సర్పంచ్ మసిముక్కు గోపాలకృష్ణ, నాయకులు, అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



రామన్నపూడిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ గద్దె పుష్పరాణి, ఎంపీడీవో విష్ణు ప్రసాద్ తదితరులు

బాలోత్సవం 29 నుంచి

గుడివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ బాలోత్సవాన్ని 29, 30 తేదీల్లో స్థానిక రాజేంద్రనగర్‌లోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు బాలో త్సవం కమిటీ గౌరవాధ్యక్షులు కోగంటి ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం మాంటిస్సోరి పాఠశాలలో గుడివాడ బాలోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లల్లో నైతిక విలువలు, ఐకమత్యం, సృజనాత్మకత ఆరోగ్యకరమైన పోటీతత్వం పెంపొందించడానికి బాలోత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. గుడివాడ బాలోత్సవం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కమిటీ అధ్యక్షుడు సనకా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి నున్న ఆంజనేయులు, సభ్యులు కె.వి.ఎస్.ప్రసాద్, ఆర్‌సిపిరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం, సభ్యులు పాల్గొన్నారు.



రహదారి వెంట ధాన్యం, ధాన్యం బస్తాలు

ముమ్మరంగా వరి కోతలు

గుడ్లవల్లేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వాతావ రణంలో మార్పులు, వర్షసూచనలు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో రైతులు హడావిడిగా వరికోతలకు పరుగులు తీస్తున్నారు. మండలంలో 22వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటివరకూ 2,500 ఎకరాల్లో కోతలు పూర్తిఅయ్యాయి. మిగిలిన రైతులు గింజ పూర్తిగా తయారు అయిన చేలు త్వరితగతిన కోతలు పూర్తి చేసి బయటపడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపుగా అందరు రైతులు వరికోత యంత్రాలపై ఆధారపడి ఉన్నారు. మండలంలో సుమారు 30 యంత్రాల ద్వారా కోతలు కొనసాగుతున్నాయి. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మండలానికి రావల్సిన వరికోత యంత్రాలు రాలేదని రైతులు యంత్రాల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం చొరవతీసుకొని వరికోత యంత్రాలను సర్దుబాటు అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

వరికోతలు ప్రారంభం

పామర్రు: మండలంలో వరికోతలను రైతులు ప్రారంభించారు. కురుమద్దాలి, కనుమూరు, కొండిపర్రు, పసుమర్రు, ఉరుటూరు, తదితర గ్రామాల్లో పాయలుతీసి పొలాల్లో నీటిని బయ టకు మళ్లించి కూలీలతోపాటుగా యంత్రాల సాయంతో వరికోతలకు సిద్ధమయ్యారు. మండలం పరిధిలో 9వేల 96హెక్టార్లలో ఖరీఫ్ సాగు జరిగినట్లు మండల వ్యవసాయాధికారిణి వి.శివనాగరాణి శుక్రవారం వెల్లడించారు.

కష్టపడి పని చేసే వారికి గుర్తింపు : ఎంపీడీవో

పెదపారుపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని ఎంపీడీవో విమాదేవి అన్నారు. పెదపారుపూడిలోని శాఖా గ్రంథాలయంలో ముగిసిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విధులు సక్రమంగా నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారిణి ఎంవిఎస్.లక్ష్మిని సత్కరించారు. ఎంఈవో సురేష్, డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు వసుాక్షి, సర్పంచ్ సమీర, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరకుమారి లక్ష్మీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ వసుధ, బసవేశ్వరరావు, రిటైర్డ్ హెడ్ మాస్టారు దొంతనాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ అధికారిణి లక్ష్మికి సత్కారం

ఏఎన్ఆర్‌లో ముగిసిన వారోత్సవాలు

గుడివాడ: ఏఎన్ఆర్ కళాశాల పీజీ గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.జె.ఎస్.కుమార్ మాట్లాడుతూ, వివిధ అంశాలపై విద్యార్థులకు అవ గాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుడివాడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 9 నుంచి 10.30 గంటలవరకు పట్టణంలోని నాగవరప్పాడు, రాజేంద్రనగర్, టీచర్స్‌కాలనీ, పాటిమీద, ధనియాలపేట, ఏలూరురోడ్డు, రైలుపేట, బేతవోలు, నిమ్మతోట, వాంబే కాలనీ, కార్మిక నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జి.బి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల గృహ, వ్యవసాయ, పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సామాజిక కార్యకర్త రవికిరణ్ నిరసన

గుడివాడ, నవంబరు21(ఆంధ్రజ్యోతి) : గ్రామంలో నాలుగు తరాలుగా మౌలిక సదుపాయాలు లేవని, నాలుగు గ్రామాలకు ఒకే కార్యదర్శి ఉండటం వలన అభివృద్ధి పనులు జరగడం లేదని సామాజిక కార్యకర్త ఆర్.రవికిరణ్ నిరసన తెలిపారు. లింగవరం రైతు సేవ కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఎదుట నిరసన తెలిపారు. 2019నుంచి గ్రీవెన్స్‌ల్లో అర్జీలు సమర్పిస్తున్న అధికా రులు పట్టించుకోవడం లేదని, దీంతో ఎమ్మెల్యే ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టినట్టు రవికిరణ్ తెలిపారు.

రాష్ట్రమాక్ అసెంబ్లీకి ఏజీకే విద్యార్థి

గుడివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏజీకే విద్యార్థి ప్రతిభ చూపాడు. ఈ నెల 26న అమరావతిలో విద్యార్థుల కోసం నిర్వహించే మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి ఏజీకే 8వ తరగతి విద్యార్థి కొల్లా సింహాద్రి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.నరేంద్రబాబు తెలిపారు. విద్యార్థి సింహాద్రిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల, తల్లిదండ్రులు అభినందించారు.

కానిస్టేబుల్ నాగబాబు రక్తదానం

గుడివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాగంటి ఆసుపత్రిలో రక్తదానం చేశాడు. 20 రోజుల బేబీకి అత్యవసరంగా ఏ పాజిటివ్ బ్లడ్ అవసరమవ్వడంతో సమాచారం అందుకున్న టూటౌన్ కానిస్టేబుల్ కొంగం నాగబాబు రక్తదానం చేశారు. నాగబాబును సీఐ జేఆర్‌కె హరీష్ అభినందించారు.

ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయండి

గుడివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ జిల్లా మహాసభలను 2026 ఫిబ్రవరి 5వ తేదీన గుడివాడలో నిర్వహిం చనున్నట్లు నాయకులు చింతలూరి సత్యనారాయణ, గూడపాటి ప్రకాష్‌బాబు, కొఠారి రమణలు తెలిపారు. శుక్రవారం ఏలూరు రోడ్డులోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గుడివాడలో నిర్వహించే జిల్లా మహాసభలకు కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.



కూచిపూడి వేదాంతం వారి ధర్మ చెరువులో దీపాలు వదులుతున్న మహిళలు



అష్టలక్ష్మి అమ్మవారు



గుడ్లవల్లేరు పుల్లేరులో..

భక్తిశ్రద్ధలతో పోలి స్వర్గం

కూచిపూడి, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): కార్తీకమాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నెలరోజులపాటు దీక్షలు నిర్వహించి పూజా కార్యక్రమాలు నిర్వహించిన భక్తులు, మహిళలు శుక్రవారం తెల్లవారుజాము నుంచి పోలిని స్వర్గానికి పంపించే కార్యక్రమం నిర్వహించారు. కూచిపూడిలో నాట్య పుష్కరిణి (వేదాంతం వారి ధర్మ చెరువు) ఒడ్డున దీపాలు వెలిగించి నోమును ఆచరించారు. ఈ సందర్భంగా పుష్కరిణి దీపాలతో నూతన శోభను సంతరించుకుంది. అంతకు ముందుగా దీనికి సమీపంలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మారేడు చెట్టు, ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించి అరటి దొప్పలలో వాటిని ఏర్పాటు చేసుకుని పుష్కరిణిలో వదిలేశారు. అలాగే భీమనది పంట కాలువ వద్ద, మండలంలోని 21 గ్రామాల్లో చెరువుల వద్ద నీటిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి కార్తీక మాస పూజలకు స్వస్తి చెప్పారు.

పుల్లేటి కాల్వలో..

పామర్రు: తెలుగునాట స్త్రీలంతా అమావాస్య మర్నాడు వచ్చే పాడ్యమి రోజున పోలిస్వర్గం వేడుకనునిర్వహించుకోవడం అనాధిగా వస్తున్నా సంప్రదాయమని, ఇది అత్తాకోడళ్ల మధ్య సఖ్యత ఉండాలని బోధిస్తుందని శివాలయం అర్చకులు లంకా బిష్మకుమార్, తోలేటి సోమేశ్వర్ పేర్కొన్నారు. కార్తీకమాసం ముగింపును పురస్కరించుకొని కొండిప్రరు రోడ్డులో గల పుల్లేటి రేవు వద్ద శుక్రవారం పోలిని స్వర్గానికి పంపే వేడుకను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

దీపాలు వదులుతున్న మహిళలు

గుడ్లవల్లేరు: కార్తీకమాసం అంతా దీపారాధనలు నిర్వహించి పూజలు చేసిన మహిళలు శుక్రవారం పోలిని సాగనంపే కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచే పెద్ద సంఖ్యలో గుడ్లవల్లేరు పుల్లేరు వద్దకు మహిళలు చేరుకొ న్నారు. పుల్లేరులో పుణ్యస్నానాలు ఆచరించి అరటిడొప్పల్లో దీపాలను వెలిగించారు. పూజలు నిర్వహించారు. పుల్లేరు గట్టున ఉన్న శివలింగానికి, నందీశ్వరునికి పూజలు నిర్వహించారు. అనంతరం అరటి డొప్పల్లో వెలిగించిన దీపాలను సంప్రదాయం ప్రకారం పుల్లేరులో వదిలి నమస్కరించారు.

అష్టలక్ష్మీ ఆలయంలో..

గుడివాడ రూరల్: చినఎరుకపాడులోని అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారు ప్రత్యేక పూజలందుకున్నారు. పోలి శుక్రవారం సందర్భంగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ఛైర్మన్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ట్రస్టీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించారు. గుడివాడ, చుట్టూపక్కల గ్రామాల నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు.

గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ

గుడ్లవల్లేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రేన్ గ్రీన్ గ్రామంలో భాగంగా హరితరాయబారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్ర వారం జిల్లా వనరుల కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ కే.ఎస్.ఎస్ అన్నపూర్ణాదేవి గుడ్లవల్లేరులో హరితరాయబారులు నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ప్లాస్టిక్ రహిత స్వచ్ఛ గుడ్లవల్లేరుగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్, డిప్యూటీ ఎంపీడీవో అంజనాదేవి, గుడ్లవల్లేరు పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, శానటరీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెదపారుపూడి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటంలో హరిత రాయబారులు, హరిత రక్షకుల పాత్ర కీలకమని, చేసే పనిలో మరింత నాణ్యతకు శిక్షణ అనేది దోహదపడుతుందని పెదపారుపూడి ఎంపీడీవో విమాదేవి అన్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద మండలంలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కు థీమ్-5 క్లీన్ అండ్‌గ్రీన్ విలేజ్ అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించటానికి గ్రీన్‌అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు చేస్తున్న కృషి అనిర్వచనీయమన్నారు. డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, సర్పంచ్ పునుకొల్లు శివరామ ప్రసాద్, కార్యదర్శి కృష్ణవేణి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 660



రేపు గుత్తికొండ రామరత్నం ట్రస్టు జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుత్తికొండ రామరత్నం చారిటబుల్ ట్రస్టు జీవన సాఫల్య పురస్కారాలను ఏడుగురికి ప్రదానం చేస్తున్నట్టు ట్రస్టు అధినేత గుత్తికొండ సుబ్బారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు చిలకలపూడి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యావేత్త ఆచార్య ఎం.సి.దాస్, ఉయ్యూరు సరసభారతి అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్, విజయవాడ స్త్రీవాద కవయిత్రి మందలపు హైమావతి, విజయవాడకు చెందిన కవి గుమ్మా సాంబశివరావు, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, మైలవరం విద్యావేత్త దామెర్ల నరసింహారావు, భావతరంగిణి ప్రతినిధి భవిష్యకు అవార్డులు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రచయిత డాక్టర్ జి.వి.పూర్ణచంద్ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● అధికారులతో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు కలెక్టర్ బాలాజీ సూచించారు. బందరు మండలం భోగిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు రోడ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. పంచాయతీ రాజ్ అధికారులతో చర్చించారు. వైద్యసేవా కేంద్రాన్ని సందర్శించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించే విధానంపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదనరావు, ఎండీవో వెంకటేష్ పాల్గొన్నారు.



భోగిరెడ్డిపల్లిలో పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

వివాదాస్పద చెరువు పరిశీలన

చల్లపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చింతలమడలో వివాదాస్పద చెరువును శుక్రవారం తహసీల్దార్ డి. వనజాక్షి, డ్రెయినేజీ శాఖ డీఈ బాబూనాయక్, ఏఈ చిరంజీవి శుక్రవారం పరిశీలించారు. డ్రెయినేజీ పోరంబోకును ఆక్రమించుకుని చుట్టుపక్కల వ్యవసాయ భూములకు ఇబ్బంది కలిగేలా చెరువు తవ్వడంపై రైతులు కలెక్టరేట్‌కు వెళ్లి ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక అధికారులు శుక్రవారం చెరువును పరిశీలించారు. డ్రెయినేజీపై ఆధారపడి చింతలమడ, దాలిపర్రు, ఘంటసాల, బిరుదుగడ్డ, దేవరకోట రైతులు సాగు చేస్తున్నారని, మురుగుకాల్వలో నీటిని ఇంజన్లతో తోడుకుని చేలకు నీటిని పెట్టుకుంటారని రైతు పెద్ద, డీసీ మాజీ చైర్మన్ వీరమాచనేని భవానీప్రసాద్, రైతులు తెలిపారు. డ్రెయినేజీ భూముల్లో చెరువు తవ్వి, కట్టలు పోసుకున్నారని, వ్యవసాయం చేస్తే ఇబ్బందిలేదని, చెరువుసాగు కారణంగా నీరు ఉప్పుగా మారి వ్యవసాయం ఇబ్బందిగా మారుతుందని చెప్పారు. రైతులే చెరువు కట్టలు తొలగించుకుంటారా అని తహసీల్దార్ ప్రశ్నించగా, అధికారులు అనుమతిస్తే రైతులమే యంత్రసహాయంతో చెరువు కట్టలు తొలగిస్తామని రైతులు స్పష్టంచేశారు. డ్రెయి నేజీ అధికారులు పోలీసు బందోబస్తు కోసం ఎస్పీకు లెటరు పంపితే చెరువు కట్టల తొలగింపు చర్యల్లో రెవెన్యూ అధికారులం మద్దతుగా నిలబడతామని తహసీల్దార్ తెలిపారు. వీఆర్వో తూము శ్రీనివాసరావు, రైతు లు గొర్రెపాటి సురేష్, గొల్లపూడి పూర్ణచంద్రరావు, సూదాని వెంకటేశ్వరరావు, కుటుంబరావు పాల్గొన్నారు.



తహసీల్దార్ వనజాక్షి, డ్రెయినేజీ డీఈ బాబూనాయక్‌తో మాట్లాడుతున్న రైతుపెద్ద భవానీప్రసాద్, రైతులు

ఆక్రమణలపై డీఎల్పీవో విచారణ

మోపిదేవి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి గ్రామపంచాయతీ పరిధిలో ప్రధాన రహదారి వెంబడి ఆక్రమణలు ఉన్నాయంటూ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై మచిలీపట్నం డీఎల్పీవో రజావుల్లా విచారణ చేశారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు దారుడైన తాతినేని లీలా కృష్ణ సమక్షంలో ఆయన విచారణ చేపట్టారు. గ్రామంలోని 633 సర్వేలోని ప్రభుత్వ భూములను ఆక్రమించి కట్టడాలు నిర్మాణమయ్యాయని వచ్చి న ఫిర్యాదుపై డీపీవో ఆదేశాల మేరకు విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కట్టడాలు ఆక్రమణలో ఉన్నాయా అని నిర్ధారించేందుకు సర్వేయ ర్ అందుబాటులో లేరని తెలిపారు. ఈవోపీఆర్డీ కేటీ సుందరి, పంచాయతీ కార్యదర్శి కె.రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



విచారణ జరుపుతున్న డీఎల్పీవో రజావుల్లా



ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నేతలు

ఏఎంసీ చైర్మన్ కొల్లూరికి సత్కారం

అవనిగడ్డ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావును శుక్రవారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో అవనిగడ్డ నియోజకవర్గ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని కొల్లూరి హామీ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరావు, సభ్యులు అన్నం కిషోర్, శంకర్, శ్రీధర్, సాయిసందీప్ పాల్గొన్నారు.

బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి

● పార్టీ మండలాధ్యక్షులతో జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరాం

చల్లపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షు లకు జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరాం సూచించారు. చల్లపల్లిలో రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం చల్లపల్లి, ఘంటసాల మండలాల బీజేపీ మండల అధ్యక్షుల ఎన్నిక నిర్వహించారు. బీజేపీ చల్లపల్లి మండల అధ్యక్షుడిగా వీహెచ్‌పీ మండల ప్రఖండ అధ్యక్షుడు అడపా రవి, ఘంటసాల మండల అధ్యక్షుడిగా తాళ్లూరి హరిప్రసాద్‌ను ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుం గల మురళీకృష్ణ, నియోజకవర్గ కన్వీనర్ నండూరి రాజేంద్రనాథ్, సనకా ప్రశాంత్, దోనేపూడి శివరామయ్య, వేములపల్లి శ్రీహరి పాల్గొన్నారు.



బీజేపీ చల్లపల్లి మండల అధ్యక్షుడిగా అడపా రవికి నియామక పత్రం అందిస్తున్న తాతినేని శ్రీరామ్

టీడీపీ నేత నాగాంజనేయులుకు మాతృవియోగం

నాగాయలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా నేత, మత్స్యకార సంఘం రాష్ట్ర నాయకుడు లకనం నాగాంజనేయులు తల్లి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు శారదాంబ(94) గురువారం రాత్రి నాగాయలంకలోని స్వగృహంలో మృతి చెందారు. శుక్రవారం ఆమె భౌతికకాయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, తలశిల స్వర్ణలత, మెండు లక్ష్మణరావు, చిట్టా అన్నపూర్ణయ్య, కన్నా నాగరాజు, కర్రి కృష్ణమూర్తి, లంకే శ్రీనివాస ప్రసాద్, నాగిడి తాతారావు సందర్శించి నివాళులర్పించారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

కోడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఈస్ట్ చానల్ 12వ నెంబరు పంట కాలువలో చెత్త తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. నీటి సంఘం అధ్యక్షుడు బండే వెంకటేష్, పూతబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.







మచిలీపట్నం రామలింగేశ్వరస్వామి దేవాలయం, నాగులేరు, నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం వద్ద అరటిదొప్పల్లో దీపాలు వదులుతున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి

నాగాయలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగింపుగా పోలి పాడ్యమి కార్యక్రమాన్ని భక్తులు శుక్రవారం ఉదయం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శ్రీరామపాదక్షేత్రంలో మార్గశిర మాసం పోలి పాడ్యమి పురస్కరించుకుని వేకువజాము నుంచే భక్తులు పుష్కర ఘాట్‌లో పుణ్యస్నానాలు చేసి కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. కార్తీక దీపాలను డొప్పల్లో పెట్టి నదిలోకి వదులుతూ వెళ్లి రావమ్మా పోలి అంటూ వీడ్కోలు పలికారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.

అవనిగడ్డ రూరల్: కొత్తపేట వద్ద కృష్ణానది వద్ద దీపాలను వెలిగించి నదిలోకి వదిలారు. భక్తులు పలు దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

చల్లపల్లి: నడకుదురు కృష్ణానదిలో అరటిదొప్పల్లో దీపారాధనలు చేసి నీటిలో వదిలారు. పంట కాలువలు, పుష్కరఘాట్‌లు, చెరువుల్లో మహిళలు స్నానాలు చేసి పూజలు చేసి పోలిస్వర్గం కార్యక్రమంలో పాల్గొనగా, కాలువలకు, నదివద్దకు వెళ్లలేని మహిళలు ఇళ్లవద్దే తులసిచెట్టు వద్ద పూజలుచేసి దీపారాధలను చేసి పోలిని సాగనంపారు.

నాగులేరు వద్ద..

మచిలీపట్నం టౌన్: బందరు నాగులేరు వద్ద శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు చేసి అరటిదొప్పల్లో దీపాలు వెలిగించారు. నాగులేరులో వదిలి పోలెమ్మను స్వర్గానికి పంపారు. నాగులేరు ఒడ్డున రసలింగేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద ..

రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద ఉన్న కోనేరులో భక్తులు పోలి స్వర్గం కార్యక్రమం నిర్వహించారు. అరటిదొప్పల్లో దీపాలు వెలిగించి కోనేరులో విడిచిపెట్టారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు దేసు నీరజ, కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయస్వామి పాల్గొన్నారు.



లక్ష్మీపురం సోమేశ్వరస్వామి

సోమేశ్వరస్వామికి అన్నాభిషేకం

చల్లపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలోని దుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామికి శుక్రవారం అన్నాభిషేకం చేశారు. కార్తీకమాసం ముగింపు పోలి పాడ్యమిని పురస్కరించుకుని స్వామికి అభిషేకాలు చేసి అన్నాభిషేకం జరిపారు. దుర్గాపార్వతీ అమ్మవారికి పూజలు చేసి విశేష అలంకరణలు చేశారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని టీడీపీ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. పోతేపల్లిలో శుక్రవారం నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్, శ్రమదానం కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్‌తో కలి సి ఆయన పాల్గొన్నారు. కార్యదర్శులు ప్రజలకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించాలని ఎండీవో సీహెచ్ వెంకటేష్ సూచించారు. స్వచ్ఛరథంపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించి పనికిరాని వస్తువులను తీసుకుని నిత్యావసరాలు అందజేశారు. డిప్యూటీ ఎండీవో ఎ.బాలకృష్ణారావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాటం మధుసూధనరావు, నాయకులు పామర్తి నాగరాజు, కమ్మిలి మధు, కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.





పోతేపల్లిలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు.. ముంజులూరులో అధికారులు

సుల్తానగరంలో క్లీన్ అండ్ గ్రీన్

సుల్తానగరం గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. గోల్డ్ కన్వెన్షన్ హాలు నుంచి నాగేంద్రస్వామి పుట్ట వరకు రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు బోలెం బాలకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ కాగిత వీరరాఘవులు, మన్నెం శ్రీనివాసరావు, వీరంకి వెంకటప్పయ్య, చిట్టిబొమ్మ వనరాజు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి పెద్దపీట

అవనిగడ్డ: గ్రామాల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని ఎంపీడీవో మరియకుమారి సూచించారు. అవనిగడ్డలో పచ్చదనం - పరిశుభ్రత కోసం చేపట్టిన విజిబుల్ గ్రీన్ శిక్షణ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్స్, సీఆర్పీలకు ఆమె శిక్షణ ఇచ్చారు. ఈ బృందాలు అవనిగడ్డలోని ప్రతీ ఇంటిని సందర్శించి తడి, పొడి చెత్తను వేరు చేయాల్సిన ఆవశ్యకతపై వివరించారు. గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించారు. అవనిగడ్డలో విజిబుల్ క్లీన్ విలేజ్ ద్వారా సాధించిన ఫలితాలను మండలంలోని మిగిలిన అన్నీ గ్రామాల్లో అమలు చేస్తామని ఎంపీడీవో తెలిపారు. సర్పంచ్ గొరుముచ్చు ఉమా, పి.చంద్రశేఖర్, జిల్లా లింక్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లు, కార్యదర్శులకు శిక్షణ

పెడన రూరల్: చెత్త సేకరణ సమయంలో కార్మికులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, సంపద తయారీ కేంద్రాల్లో వాటిని విభజించి సంపద సృష్టించవచ్చని ఎండీవో ఎ.అరుణకుమారి తెలిపారు. మండలస్థాయి చెత్త సేకరణ కార్మికులు(గ్రీన్ అంబాసిడర్లు), పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. హర్షతుల్లా, అనూరాధ, కరీముల్లా, షణ్ముఖరావు, రాజేష్, నాగరాజు, విజయలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

ముంజులూరులో..

బంటుమిల్లి: గ్రామాల్లో పచ్చదనం-పరిశుభ్రత ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో టి.నీరజాక్షి అన్నారు. ముంజులూరు గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. రోడ్ల పరిశుభ్రత, చెత్త కుప్పల తొలగింపు పనులు చేశారు. చెత్త నుంచిసంపద తయారీ కేంద్రాల వద్ద అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సర్పంచ్ కూనపరెడ్డి సునీత, డిప్యూటీ ఎంపీడీవో కె.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రీన్‌గార్డ్స్, అంబాసిడర్స్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మలపాలెంలో ఫ్రైడే డ్రైడే

గూడూరు: తుమ్మలపాలెం పంచాయతీలో శుక్రవారం మల్లవోలు పీహెచ్‌సీ ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అవగాహనా ర్యాలీ, ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. ఆరు బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. సిబ్బంది సుబ్రహ్మణ్యం, ఆశావర్కర్ కీర్తి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

మోపిదేవి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి మిర్యాలగూడకు చెందిన వంగపల్లి పుల్లయ్య - చంద్రకళ దంపతులు రూ.1,00,001, ఉజ్జిని శ్రీనివాసరావు-సౌజన్య రూ.1,00,001 విరాళమిచ్చారు. నగదును ఆలయ సహాయక ఉద్యోగి బి.కిషోర్‌కు అందజేశారు.

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ హామీ

పెడన, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. పెడన బ్రాహ్మణ సంఘ నాయకులతో కలిసి శుక్రవారం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.వి. ఫణికుమార్ మర్యాదపూర్వకంగా కృష్ణప్రసాద్‌ను కలిశారు. బ్రాహ్మణుల అభ్యున్నతికి తగిన సహకారం అందించాలని కోరారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు జరిగేలా కృషి చేస్తానని కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను ఫణికుమార్ సత్కరించారు. బ్రాహ్మణ సంఘ నాయకులు మల్లంపల్లి శ్రీనివాసరావు, సింగరాజు బాలసుబ్రహ్మణ్యం, మల్లంపల్లి కుమార్, మచిలీపట్నం ఏఎంసీ డైరెక్టర్ చోడవరపు లక్ష్మీప్రసన్న, వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న పీవీ ఫణికుమార్, బ్రాహ్మణ సంఘ నాయకులు

ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతాం

పెడన, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. బొడ్డు వేణుగోపాలరావు, శలపాటి ప్రసాద్, పూలబాబు, వడుగు తులసీరావు, వరుదు రామకృష్ణ, బొర్రా కాశీ, కమ్మగంటి బాబు, శీరం ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యంపై సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. శుక్రవారం శిడింబి అగ్రహారంలోని తన కార్యాలయంలో 3వ డివిజన్‌కు చెందిన పామర్తి వెంకటేశ్వరరావుకు రూ.79, 687, 46 వడివిజన్‌కు చెందిన తాతా అంజయ్యకు రూ.20 వేలు, పామర్తి రాధికకు రూ.55,884 చెక్కులను ఆయన అందజేశారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, గండికోట అంజిబాబు పాల్గొన్నారు.

ఢిల్లీ బాంబు పేలుళ్ల మృతులకు నివాళి

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ బాంబు పేలుళ్లలో మృతిచెందిన వారికి శుక్రవారం కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అబ్దుల్ మతీన్ మాట్లాడారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మోదీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించేవారని, దేశంలో పలు చోట్ల ఉగ్రవాదులు దాడులు జరుపుతుంటే ప్రధాని హోదాలో ఇప్పుడు మౌనంగా ఉండటం ఏంటని ప్రశ్నించారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందు కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తాయన్నారు. కొకా ఫణిభూషణ్, కొడమంచిలి చంద్రశేఖర్, చిలుకోటి ప్రసాద్, ఎస్. శామ్యూల్ పాల్గొన్నారు.

తీరప్రాంత భద్రత సాగర్ కవచ్ లక్ష్యం

కోడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత భద్రతే లక్ష్యంగా సాగర్ కవచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మెరైన్ సీఐ సురేష్ రెడ్డి అన్నారు. మెరైన్ పోలీసు, భద్రత దళాలు కలిసి శుక్రవారం సాగర్ కవచ్ మాక్ డ్రిల్ నిర్వహించారు. పాలకాయితిప్ప, హంసలదీవి, గుల్లలమోద గ్రామాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పాలకాయితిప్ప సముద్ర తీర ప్రాంతంలో బోట్లలో నిఘాను ఏర్పాటు చేశారు. తీర ప్రాంతం నుంచి ఉగ్రవాదులు ఎవరూ చొరబడకుండా ఉండేందుకు ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సీఐ తెలిపారు. ఈ మాక్‌డ్రిల్‌లో మెరైన్ ఎస్సైలు ఉజ్వల్‌కుమార్, పూర్ణమాధురి, సిబ్బంది పాల్గొన్నారు.



పాలకాయితిప్ప సముద్ర తీరంలో గస్తీ కాస్తున్న మెరైన్ పోలీసులు

యాజమాన్య పద్ధతులు పాటిస్తే

స్కోప్ సర్టిఫికెట్ సాధ్యమే

బంటుమిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'స్కోప్ సర్టిఫికెట్ వస్తే విత్తనాలు విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చు. ఎకరానికి రూ.లక్ష ఆదాయం సమకూరుతుంది. మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే స్కోప్ సర్టిఫికెట్ సాధ్యమే.' అని సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ప్రాజెక్టు ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షరీఫ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం అర్తమూరులో జై భారత్ ఎఫ్‌పీవో ద్వారా 25 మంది రైతులు నిర్వహిస్తున్న వరి సాగు విధానాన్ని అధికారులు పరిశీలించారు. ఏడీఏ ఎన్.రమాదేవి, టి.అజయ్, జై భారత్ ఫార్మాసిస్ట్ ప్రెసిడెంట్ చండిక గంగాజలరావు, కార్యదర్శి మలిశెట్టి శివరామప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

జాతీయభావం పెంపొందించుకోవాలి

● విద్యార్థులకు ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీనాథ్ సూచన

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లోని విద్యార్థులు జాతీయ భావాలు పెంపొందించుకోవాలని, దేశం పట్ల గౌరవంతో ఉండాలని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీనాథ్ అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని శ్రీనాథ్ సూచించారు. ప్రిన్సిపాల్ వి. నరసింహారావు, ఏవో ఎ.బాపూజీ, వైస్‌ప్రిన్సిపాల్ బి.కిషోర్ మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

కుక్కల నాగేశ్వరరావుకు ఘన నివాళి

పెడన, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దివంగత కుక్కల నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. పుట్టి కృష్ణప్రసాద్, జొన్నలగడ్డ ఆంజనేయులు, దండుబోయిన గణేష్, పల్లపోతు మోహన్, బోయిన బాలాజీ పాల్గొన్నారు.